ESTD : 1999
# విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

స్టేట్ విజన్
STATE VISION

శనివారం 11-07-2026 పేజీలు : 16

### ఎన్‌హెచ్‌ఎం కింద ఖాళీ పోస్టుల భర్తీకి
## దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. సంధ్య కిరణ్మయి



గద్వాల జూలై 10 (విజన్ ఆంధ్ర) జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశానుసారం జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. సంధ్య కిరణ్మయి ఒక ప్రకటనలో తెలిపారు.

11 పేజీలో...

## బహదూర్‌పల్లిలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై ఉక్కుపాదం

- 42 అక్రమ నిర్మాణాల తొలగింపు.. పాదచారులకు ఊరట
- బహదూర్‌పల్లి చౌరస్తా నుంచి ఎస్‌వీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వరకు ప్రత్యేక డ్రైవ్
- రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన నిర్మాణాల కూల్చివేత
- ట్రాఫిక్‌కు ఆటంకం, ప్రమాదాల నివారణే లక్ష్యమన్న అధికారులు
- ప్రభుత్వ భూముల ఆక్రమణలను ఉపేక్షించబోమని హెచ్చరిక
- నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు, కఠిన చర్యలు
- డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్ ఆధ్వర్యంలో తనిఖీలు



దుండిగల్, జూలై 10 (విజన్ ఆంధ్ర): నగరంలో పాదచారుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యల్లో భాగంగా బహదూర్‌పల్లి పరిధిలో మున్సిపల్ అధికారులు శుక్రవారం ప్రత్యేక ఆక్రమణల తొలగింపు డ్రైవ్ నిర్వహించారు.

11 పేజీలో...

హుస్నాబాద్‌లో.....
## రూ.45.15 కోట్లతో
### అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్‌కు
## భూమిపూజ



అక్కన్నపేట, జూలై 10 (విజన్ ఆంధ్ర): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామంలో రూ.45.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి శుక్రవారం భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్‌ను వెనుకబడిన ప్రాంతంగా కాకుండా రాష్ట్రంలో అభివృద్ధిలో ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

3 పేజీలో...

## పలు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కుంభం



యాదాద్రి జూలై 10 వలిగొండ (విజన్ ఆంధ్ర) వలిగొండ మండలం సంగెం.ధర్మారెడ్డిపల్లి.గోకారం గ్రామాల పరిధిలో రూ 124 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు ధర్మారెడ్డి కాల్వ పునరుద్ధరణ పనుల నాణ్యత కాల్వ వెడల్పు లోతు నీటి ప్రవాహానికి చేపట్టిన ఏర్పాట్లు కాల్వను ఆనుకుని నిర్మిస్తున్న రహదారి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ధర్మారెడ్డి కాల్వ శిథిలావస్థకు చేరిందన్నారు కాల్వలో మట్టి రాళ్లు పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయిందని చెప్పారు కాల్వ పక్కన ఉన్న రహదారి దెబ్బతినడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ 124 కోట్ల నిధులతో కాల్వను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు కాల్వలో అడ్డంకులను తొలగించి చివరి ఆయకట్టు వరకు నీరు అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానంతో పనులు చేపట్టామన్నారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు కాంగ్రెస్ మండల అధ్యక్షులు బత్తిని సహదేవ్ వివిధ గ్రామాల సర్పంచులు నాయకులు పాశం సత్తిరెడ్డి బాతరాజు నరసింహ చెరుకు శివయ్య గౌడ్ బద్దం సంజీవరెడ్డి జక్క జంగారెడ్డి కాసుల వెంకన్న కొండూరు సాయి మామిడి నరేందర్ రెడ్డి వివిధ గ్రామాల నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు

## ఉమ్మడి కృషితోనే అభివృద్ధి సాధ్యం

-- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



3 పేజీలో...

## విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేదే లేదు..

- సమయ పాటించని సిబ్బంది పై చర్యలు తీసోకండి
- డిఎంహెచ్ఓ కు కలెక్టర్ హైమావతి ఆదేశం



కుకునూరుపల్లి, జూలై 10,విజన్ ఆంధ్ర : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హైమావతి హెచ్చరించారు. శుక్రవారం ఉదయం కొండపాక మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

15 పేజీలో...

# కదిలిన విద్యుత్ యంత్రాంగం "విజన ఆంధ్ర" ఎఫెక్ట్



వాజేడు,జులై10(విజన్ ఆంధ్ర): "విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం"చేతి కందే ఎత్తులో విద్యుత్ తీగలు, పొంచి ఉన్న ప్రమాదం, ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా..? అనే శీర్షికతో "విజన్ ఆంధ్ర" దినపత్రిక గురువారం వార్తను ప్రచురితం చేశారు. దీంతో వెంటనే స్పందించిన విద్యుత్ ఉన్నతాధికారులు శుక్రవారం ఉదయాన్నే వాజేడు ఏఈ అర్షద్ అహ్మద్ తన సిబ్బందితో చెరుకూరు పంచాయతీ, బయ్యారం గ్రామం చేరుకొని ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను స్తంభాలకు టైట్ గా లాగి, విద్యుత్ సమస్య పరిష్కరించారు. ప్రజా సమస్యను వెలుగులోకి తీసుకు రావడంతో సంబంధిత అధికారుల్లో స్పందన వచ్చి వెంటనే సమస్య పరిష్కారం లభించడంతో బయ్యారం గ్రామస్తులు "విజన్ ఆంధ్ర"కు కృతజ్ఞతలు తెలిపారు

# హుస్నాబాద్‌లో రూ.45.15 కోట్లతో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్‌కు భూమిపూజ

అక్కన్నపేట, జూలై 10 (విజన్ ఆంధ్ర): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం తోటపల్లి గ్రామంలో రూ.45.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి శుక్రవారం భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్‌ను వెనుకబడిన ప్రాంతంగా కాకుండా రాష్ట్రంలో అభివృద్ధిలో ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పర్యాటకం, విద్య, వైద్యం, మౌలిక వసతుల రంగాల్లో భారీ పెట్టుబడులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఏటీసీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి స్థానిక యువతకు అత్యాధునిక సాంకేతిక శిక్షణ అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్ ఐటీఐలో ఏర్పాటయ్యే అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ద్వారా ప్రతి ఏడాది 288 మంది విద్యార్థులకు అత్యాధునిక కోర్సుల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందే ప్రతి విద్యార్థికి నెలకు రూ.2 వేల స్టైపెండ్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రొడక్ట్ డిజైన్, మాన్యుఫాక్చరింగ్, 3డీ ప్రింటింగ్, రోబోటిక్స్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఎలక్ట్రిక్ వాహనాలు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) వంటి రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు.

తెలంగాణ ప్రభుత్వం, టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో రాష్ట్రంలోని ప్రభుత్వ ఐటీఐలను ఆధునిక సాంకేతిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తోందని తెలిపారు. ఒక్క ఏటీసీ నిర్మాణానికి రూ.45.15 కోట్లు వెచ్చిస్తుండగా, అందులో టాటా టెక్నాలజీస్ రూ.31.05 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ.14.01 కోట్లు వ్యయం చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 65 అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటుకు రూ.2,379.63 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ యువతకు మరింత ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అదనంగా మరో 54 ఏటీసీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. హుస్నాబాద్ ప్రాంతంలో పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కళాశాలలు, 250 పడకల ఆసుపత్రి, పీజీ మెడికల్ కళాశాల, ఎల్లమ్మ చెరువు పర్యాటక అభివృద్ధి, అర్బన్ ఫారెస్ట్ పార్క్, మహాసముద్రం గండి, భైరవస్వామి ఆలయ అభివృద్ధి, నాలుగు లైన్ల రహదారి వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. టామ్‌కామ్ ద్వారా విదేశీ ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర బృందం శుక్రవారం పర్యటించిందని, ప్రాజెక్టు కాలువల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.220 కోట్లు కేటాయించిందని తెలిపారు. రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ ఛైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ ఛైర్‌పర్సన్ చిత్తారి పద్మ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ తిరుపతి రెడ్డి, వైస్ ఛైర్మన్ బంక చందు తదితరులు పాల్గొన్నారు.

# సర్వేలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

వాజేడు,జులై10(విజన్ ఆంధ్ర): కొప్పుసూరు గ్రామంలో జరుగుతున్న "సర్" సర్వేలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ..బూతు లెవెల్ ఏజెంట్లు దగ్గర ఉండి చూడాలన్నారు. "సర్" సర్వేలో పాల్గొని ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే విధంగా అధికారులు సర్వే చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మరుమూరు సర్పంచ్ మడకం సుభద్ర,కాంగ్రెన్ పార్టీ నాయకులు కాజావలి,వెంకటేశ్వర్లు,లక్ష్మణ్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు



# ఉమ్మడి కృషితోనే అభివృద్ధి సాధ్యం

**-- ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

స్టేషన్ ఘన్‌పూర్/ జఫర్గడ్, జూలై 10, (విజన్ ఆంధ్ర) :ప్రజలు కలసికట్టుగా ముందుకు సాగుతూ ఉమ్మడి కృషితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం జఫర్గడ్ మండల కేంద్రంలో 27లక్షల 50వేలతో నిర్మించిన సిసి రోడ్లు ప్రారంభించి 10లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. జఫర్గడ్ మండల కేంద్రంలోని రామాలయం ఆవరణలో జఫర్గడ్, ఐనవోలు మండలాలకు సంబంధించిన 8మంది కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు 08లక్షల 928రూపాయల చెక్కులు, 49మంది లబ్ధిదారులకు 17లక్షల 91వేల 250రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణి చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జఫర్గడ్ నుండి సూరారం వరకు 6కోట్లతో డబుల్ రోడ్డు మంజూరు అయిందని తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ నుండి వర్ధన్నపేట వరకు 40కోట్లతో నాలుగు లైన్ల రోడ్డు మంజూరు అయిందని ఇందులో జఫర్గడ్ లో రెండు కిలోమీటర్లు నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణంతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. వేల్పుగొండ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి కమిటీ ఏర్పాటు చేసుకొని అభివృద్ధి పనులు చేసుకుందామని తెలిపారు. 6గ్యారెంటీల అమలులో భాగంగా అనేక కొత్త పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణి, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరుతున్నాయని వెల్లడించారు. 9రోజులలో 9వేల కోట్ల రైతు భరోసా నిధులను కోటి 51లక్షల ఎకరాలకు 73లక్షల 50వేల మంది రైతుల ఖాతాలలో పెట్టుబడి సాయన్ని జమ చేసినట్లు వెల్లడించారు. ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుల్లా మోహన్ రావు, పిఏసీఎస్ ఛైర్మన్ తీగల కరుణాకర్ రావు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# మెగా ఫామ్ ఆయిల్ ప్లాంటేషన్ కార్యక్రమం



సిద్దిపేట జిల్లా అక్క న్నపేట మండలం జూలై 10 విజన్ ఆంధ్ర

హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్న పేట మండలం జనగామ గ్రామంలో మెగా ఫామ్ ఆయిల్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా ఆయిల్ పామ్ మొక్కలు నాటిన మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, కార్యక్రమంలో పాల్గొన్న మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి,జాయింట్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్ ,మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శివయ్య, ఇతర ముఖ్య నేతలు , అధికారులు ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతు సంపత్ ను అభిందింవి సత్కరించిన మంత్రులు మంత్రి పొన్నం ప్రభాకర్

జనగామ లో ఆయిల్ ఫామ్ సాగు కోసం మొక్కలు నాటినందున మీకు అభినందనలు..తన 8 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ మొక్కలు నాటుతున్న రైతు సంపత్ కి అభినందనలు ఆయిల్ ఫామ్ సాగు పెంచడానికి 5 ఎకరాల పైన ఉన్న రైతులతో సమావేశం ఏర్పాటు చేశాం. ఆయిల్ ఫామ్ డిమాండ్ కి తగ్గ ఉత్పత్తి లేదు.. రైతులు ఆయిల్ ఫామ్ సాగు వైపు మొగ్గు చూపాలి మనకు కూత వేటు దూరంలో నర్మేట లో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ను ముఖ్యమంత్రి గారు ప్రారంభించారు.

హుస్నాబాద్ ప్రాంత రైతాంగానికి విజ్ఞప్తి అన్ని గ్రామాల సర్పంచ్ లు , ప్రజా ప్రతినిధులు అధికారులు ఆయిల్ ఫామ్ సాగు వైపు మొగ్గు చూపాలి. జిల్లాలో 50 వేల ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.. ఇప్పుడు 14 వేల ఎకరాలకు పైగా సాగు జరుగుతుంది.. ఒక్కో చిన్న గ్రామంలో 100 ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగు దాటిస్తే 5 లక్షలు ,పెద్ద గ్రామాల్లో 200 ఎకరాల పైన సాగు ప్రోత్సహిస్తే 10 లక్షల అభివృద్ధి ప్రోత్సాహకాలు అందిస్తాం..

ఎల్ నినో రాబోతుంది..తీవ్ర కరువు కాటకాలు వర్షాభావ పరిస్థితులు ఉంటాయి.. రైతులు ఆరుతడి పంటలు వేసుకోవచ్చు

5 ఎకరాలు ఉన్న రైతు 3 ఎకరాలు ,10 ఎకరాలు ఉన్న రైతు 7 ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగు చేయాలి

దీని ద్వారా కోతుల బెడద ఉండదు , వాతావరణ మార్పులు ఇబ్బంది ఉండదు..

4 సంవత్సరాల వరకు అంతర్ పంటలు సాగు చేయవచ్చు.. ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తుంది

రైతు భరోసా వస్తుంది. ఎకరాకు ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగు సబ్సిడీ ఇస్తుంది..

ఎకరాకు 50 వేల రూపాయలు అందిస్తున్నాం..

నర్మేట లో 40 వేల మెట్రిక్ టన్నుల ఆయిల్ ఫామ్ వస్తుంది..

రాజకీయాలకు అతీతంగా రైతాంగం గురించి ఆలోచించే వారు ఆయిల్ ఫామ్ సాగు పై అవగాహన కల్పించాలి..

కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట్ స్వామి ద్వారా ఫ్ం లకు శంకుస్థాపన చేసుకుంటున్నాం

టామ్ కాం కంపనీ ద్వారా విదేశాలకు వెళ్ళే వారికి ఉద్యోగాలు రావడానికి ఉద్యోగ మేళా ఉపయోగించుకోవాలి..

# సొసైటీ రిజిస్ట్రేషన్ నిబంధనలు అమలవుతున్నాయా..? లేక కాగితాలకే పరిమితమా..?

**- ఏజెన్సీ ప్రాంత ప్రైవేట్ పాఠశాలల్లో అమలుపై సందేహాలు**

**- విద్యాశాఖ పర్యవేక్షణపై ప్రశ్నలు**

**- అధికారిక వివరాలు వెల్లడించాలని తల్లిదండ్రుల డిమాండ్**

టేకులపల్లి, జూలై 10(విజన్ ఆంధ్ర) : ఏజెన్సీ ప్రాంతాల్లో నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తున్నాయా? సొసైటీ రిజిస్ట్రేషన్, ప్రభుత్వ గుర్తింపు, మౌలిక సదుపాయాలు, భద్రతా ప్రమాణాలు వంటి అంశాల్లో అన్ని నిబంధనలు పాటిస్తున్నాయా? అనే ప్రశ్నలు తల్లిదండ్రులు, ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. విద్యాసంస్థల నిర్వహణలో పారదర్శకత ఉండాలంటే చెల్లుబాటయ్యే సొసైటీ రిజిస్ట్రేషన్, ప్రభుత్వ గుర్తింపు, అవసరమైన అనుమతులు తప్పనిసరి. అయితే ఏజెన్సీ ప్రాంతంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలల వివరాలు బహిరంగంగా అందుబాటులో లేకపోవడం వల్ల సందేహాలకు తావు ఏర్పడిందని పలువురు పేర్కొంటున్నారు.

**పర్యవేక్షణ లోపించిందా..?**

స్థానికుల అభిప్రాయం ప్రకారం, ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. సొసైటీ రిజిస్ట్రేషన్ చెల్లుబాటు, ప్రభుత్వ గుర్తింపు, విద్యార్థుల భద్రత, మౌలిక సదుపాయాలు, అగ్నిమాపక భద్రత, తాగునీరు, మరుగుదొడ్లు, ఆట స్థలం, బోధనా సిబ్బంది అర్హతలు వంటి అంశాలను పరిశీలించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే ఇటువంటి తనిఖీలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు జరుగుతున్నాయనే అంశంపై ప్రజలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

**నిబంధనలు ఏమంటున్నాయి..?**

- చెల్లుబాటయ్యే సొసైటీ రిజిస్ట్రేషన్ ఉండాలి.
- ప్రభుత్వ గుర్తింపు తప్పనిసరి.
- నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా భవనాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతి ఉండాలి.
- విద్యార్థుల భద్రతకు సంబంధించిన నిబంధనలు పాటించాలి.
- ప్రభుత్వ తనిఖీలకు సంబంధించిన రికార్డులు అందుబాటులో ఉంచాలి.

**తల్లిదండ్రులు అడుగుతున్న ప్రశ్నలు..?**

- సంబంధిత పాఠశాల సొసైటీ రిజిస్ట్రేషన్ ఇప్పటికీ చెల్లుబాటులో ఉందా?
- ఏ విద్యా సంవత్సరం వరకు ప్రభుత్వ గుర్తింపు ఉంది?
- ఇటీవల విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారా?
- తనిఖీలు జరిగి ఉంటే వాటి నివేదిక ఏమి చెబుతోంది?
- నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై ఏ చర్యలు తీసుకున్నారు?

**పారదర్శకత అవసరం..?**

ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించిన సొసైటీ రిజిస్ట్రేషన్, ప్రభుత్వ గుర్తింపు, తనిఖీల వివరాలను అధికారికంగా ప్రజలకు అందుబాటులో ఉంచాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. దీంతో అనుమానాలకు తెరపడటమే కాకుండా, విద్యార్థుల భవిష్యత్తుపై నమ్మకం పెరుగుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

**సమగ్ర విచారణ జరపాలి..?**

ఏజెన్సీ ప్రాంతంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలపై సమగ్ర తనిఖీలు నిర్వహించి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు పాటిస్తున్న సంస్థలకు ప్రోత్సాహం, లోపాలు ఉన్న చోట చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని వారు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# వర్షం రాక పంటకు కష్టకాలం... ట్యాంకర్ నీరే రైతుకు ఆశాకిరణం

నంగునూర్ మండలం జూలై 10 విజన్ ఆంధ్ర : ఎల్‌నీనో ప్రభావంతో వర్షాకాలం ప్రారంభమై దాదాపు 40 రోజులు గడిచినా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వర్షాల కోసం ఎదురు చూస్తూనే పెట్టుబడులు పెట్టిన రైతులు ఇప్పుడు పంటలను కాపాడుకునేందుకు అదనపు ఖర్చులు భరిస్తున్నారు. ఒకవైపు ఎండలు, మరోవైపు నీటి కొరతతో వ్యవసాయం సంక్షోభంలో పడింది.

సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన రైతు రాగుల మల్లేశం తనకు ఉన్న మూడున్నర ఎకరాల భూమిలో వర్షాధార పంట సాగు చేయాలని నిర్ణయించారు. నీటి వసతి లేకపోయినా వర్షాలపై నమ్మకంతో ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 4,000 మొక్కలను తెప్పించి వారం రోజుల క్రితం నాటారు.

అయితే అప్పటి నుంచి వర్షం జాడ లేకపోవడంతో నాటిన మొక్కలు ఎండిపోతున్న పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టిన రైతు, పంటను కాపాడుకునేందుకు వాటర్ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్లకు రోజురోజుకూ పెరుగుతున్న ఖర్చు రైతుపై అదనపు ఆర్థిక భారం మోపుతోంది.

“వర్షాలు కురుస్తాయనే ఆశతో పంట వేశాం. ఇప్పుడు వర్షం లేకపోవడంతో ట్యాంకర్ నీటితో మొక్కలను బతికిస్తున్నాం. ఇంకొన్ని రోజులు కూడా వర్షాలు పడకపోతే పంట పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం మండలంలోని అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. వర్షాధార వ్యవసాయం చేసే రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తుండగా, త్వరలోనే విస్తారంగా వర్షాలు కురవాలని రైతాంగం ప్రార్థిస్తోంది.

# విద్యార్థుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరి సరికాదు

**- ముందస్తు అరెస్టులను ఖండిస్తున్నాం**

**- ఏఐఎఫ్ డీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మార్త నాగరాజు**

నల్లబెల్లి, జులై 10(విజన్ ఆంధ్ర):విద్యారంగ సమస్యలపై రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా మొండి వైఖరి అవలంబిస్తోందని ఏఐఎఫ్ డీఎస్ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు మార్త నాగరాజు ఆరోపించారు. విద్యార్థుల సమస్యలపై వామపక్ష విద్యార్థి సంఘాల రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం మండలకేంద్రంలో శాంతియుతంగా నిరసన తెలిపినందుకు పోలీసులు తనను ముందస్తుగా అరెస్ట్ చేశారని తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ......ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో సరిపడా లెక్చర్లు లేకపోవడం, హాస్టల్స్ లో కనీస సౌకర్యాలు కరువు, 12000 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ పెండింగ్ లో ఉండటం వంటి తీవ్రమైన సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. సమస్యలను ప్రశ్నించినందుకు అక్రమ కేసులు బనాయించడం, ముందస్తు అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమన్నారు. గత ప్రభుత్వం కంటే కూడా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులపై మరింత దయనీయ విధానాలు అనుసరిస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే తన మొండి వైఖరిని విడనాడి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, అరెస్ట్ చేసిన విద్యార్థి నాయకులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులందరూ ఈ నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా కలిసి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.



# ఇందిరమ్మ ఇంటితో పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం

**తుమ్మలపల్లిలో నూతన గృహప్రవేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు**

మర్పల్లి జులై 10 (విజన్ ఆంధ్ర) మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన తలారి మహేశ్వరి (భర్త పోచప్ప) నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మల సురేష్ యాదవ్ మాట్లాడుతూ, వికారాబాద్ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ముందుచూపుతో మండలానికి అధిక నిధులు మంజూరవుతున్నాయని, అత్యధిక సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరై పేద కుటుంబాల సొంతింటి కల నెరవేరుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదలకు పక్కా ఇళ్లు అందుతున్నాయని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదల ముఖాల్లో చిరునవ్వులు విరుస్తున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేస్తుందని ఆయన



అన్నారు. రానున్న రోజుల్లో మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు గడ్డం ప్రసాద్ కుమార్ కృషి చేస్తున్నారని మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి జనం నీరాజనాలు పడుతున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమ్ముతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో , మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పసుల సురేష్, తుమ్మలపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మన్నే పాండు, ఉపసర్పంచ్ సురేష్,కాంగ్రెస్ నాయకులు సురేష్, మహేష్, వార్డు సభ్యులు బి. రాజు, ప్రసాద్ గౌడ్, ఎం.డి. ముజు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

## ఏఓ గోవిందరాజు, సర్పంచ్ భద్రప్ప

కుకునూరుపల్లి, జులై 10,విజన్ ఆంధ్ర : ఆయిల్ పామ్ సాగుతో ద్వారా అధిక లాభాలు పొందే అవకాశం ఉందని కుకునూరుపల్లి ఏఓ గోవింద రాజు, తిప్పారం సర్పంచ్ ఆకుల భద్రప్ప లు అన్నారు. శుక్రవారం మండలంలోని తిప్పారం గ్రామంలో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు సోమాలేటి వరలక్ష్మి కి చెందిన మూడు ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటారు. రైతులు పంటల వైవిధ్యీకరణతో పాటు అధిక ఆదాయం పొందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న జాతీయ తినదగిన నూనెల మిషన్ -- ఆయిల్‌పామ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ భద్రప్ప, మండల వ్యవసాయ అధికారి గోవిందరాజు సూచించారు. ఆయిల్‌పామ్ సాగు ద్వారా దీర్ఘకాలికంగా అధిక ఆదాయం లభిస్తుందని, ప్రభుత్వం మొక్కలు, సాంకేతిక సలహాలు,



వివిధ ప్రోత్సాహకాలను అందిస్తున్నందున అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కుకునూరుపల్లి ఏఈఓ శ్రీహరి, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ రాజు, సుధాకర్ డ్రిప్ అధికారి శ్రీనివాస్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆదర్శ పాఠశాల/కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

### 6 నుంచి 9వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లు

**- జూలై 14 వరకు అవకాశం**

**- ప్రిన్సిపాల్ జి ప్రమీల**



మర్పల్లి జులై 10 (విజన్ ఆంధ్ర): మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల/కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 8, 9 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ జి. ప్రమీల శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 14 లోగా అవసరమైన ధ్రువపత్రాలతో పాఠశాలలో సంప్రదించి ప్రవేశాలు పొందాలని ఆమె కోరారు. అర్హత కలిగిన, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, మెరుగైన విద్యా వాతావరణం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.గతంలో ఈ పాఠశాల పదో తరగతి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించారని, పేద మరియు ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ జి. ప్రమీల విజ్ఞప్తి చేశారు.

## వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతం




**- ఎస్ఎఫ్ఐ షాబాద్ మండల కమిటీ సభ్యుడు రాము యాదవ్**

షాబాద్,జూలై 10 (విజన్ ఆంధ్ర) విద్యారంగ సమస్యల పరిష్కారం, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల, ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పన తదితర డిమాండ్లతో వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు,షాబాద్ మండల్ కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నాయకులు, షాబాద్ మండల్ కమిటీ నాయకులు, అశోక్ ,కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాటను చేతల్లో చూపిస్తున్నాం

### 18వ వార్డు కౌన్సిలర్ మంగలి కళ్యాణియాదగిరి

చేవెళ్ల, జులై 10 (విజన్ ఆంధ్ర): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వార్డు ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటామని 18వ వార్డు కౌన్సిలర్ మంగలి కళ్యాణియాదగిరి తెలిపారు. 18వ వార్డుకు చెందిన దాసరి నర్సమ్మ రాజు కుమార్తె కృష్ణవేణి వివాహానికి అవసరమైన పుస్తెమెట్టెలను శుక్రవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజా సేవే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజల విశ్వాసానికి అనుగుణంగా సేవలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. వార్డు అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. తమ కుమార్తె వివాహానికి అండగా నిలిచి పుస్తెమెట్టెలు అందించిన కౌన్సిలర్ మంగలి కళ్యాణియాదగిరికి దాసరి నర్సమ్మ రాజు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం స్థల పరిశీలన



బోథ్, జూలై 10. (విజన్ ఆంధ్ర) నూతనంగా ఏర్పాటైన సొనాల మండలంలో నిర్మించ తలపెట్టిన ఎంపిడిఓ, తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణం కోసం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ శుక్రవారం అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఇటీవలే సొనాల మండలంలో నూతన ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాలు మంజూరైన విషయం విదితమే. ఈ నూతన కార్యాలయ భవనాలు అందరికీ అందుబాటులో ఉండేలా అనువైన స్థలం కోసం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ తహసిల్దార్ మల్లేష్ , ఎంపీడీవో రత్నాకర్, సోనాల సర్పంచ్ బిందుజ సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాజుల పోతన్న, బీజేపీ అధ్యక్షులు బోరె రవీందర్ లతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న వెటర్నరీ హాస్పిటల్ యందు నూతన కార్యాలయాలు నిర్మించుటకై గ్రామ నాయకులు ప్రజలు అంగీకరించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ స్థలాన్ని తహసిల్దార్ జిల్లా కలెక్టర్ కు సిఫార్సు చేశారు. దానితోపాటు రాబోయే కాలంలో పోలీస్ స్టేషన్, కోసం గాని , విద్య సంస్థలకు గాని స్థలాన్ని అందరి సమక్షంలో సుమారు 12 ఎకరాల గవర్నమెంట్ భూమిని వెలికి తీయడం జరిగిందని రానున్న రోజుల్లో అట్టి భూమిపై అధికారులు సర్వే చేస్తారని తెలిపారు. గ్రామ ప్రజలు అందరూ సహకరించి మన మండల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గాజుల పోతన్న, బిజెపి మండల అధ్యక్షులు బోరె రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పోశెట్టి ఉప సర్పంచ్ శ్రీకాంత్, వార్డు సభ్యులు రమేష్, హరీష్, నాయకులు అభిలాష్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు సదానందం , భీమ్ రావ్, హరి సింగ్, కన్నా తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ కృషి



బోథ్. జూలై 10. (విజన్ ఆంధ్ర) సోనాల మండల కేంద్రంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న దేశాయ్ బీడీ కంపెనీ తరలింపు ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, సర్పంచ్ బిందుజ సుధీర్ రెడ్డి లు దేశాయ్ బీడీ యజమాన్యంతో మాట్లాడి బీడీ కంపెనీని సోనాలలోనే ఆరు నెలల కొనసాగేలా ఒప్పించారు. గత 20 రోజులుగా సోనాల దేశాయి బీడీ కార్మికులు కంపెనీ తరలిపోతున్నదని పోరాటం చేస్తున్న సందర్భంగా వారి సమస్యని తెలుసుకొని శుక్రవారం టేకేదారులతో, ప్యాకింగ్ కార్మికులతో మాట్లాడారు. అనంతరం యాజమాన్యంను సంప్రదించి వారి సమస్యల పైన చర్చించారు. తుల శ్రీనివాస్ ఇచ్చిన భరోసా మేరకు యజమాన్యం ఆరు నెలల వరకు సోనాలలోనే కంపెనీ కొనసాగిస్తామని హామీ ఇచ్చారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా తుల శ్రీనివాస్ మాట్లాడుతు కొందరు కాంగ్రెస్ ప్యారాచూట్ లీడర్లు లెటర్ ప్యాడ్లు పెట్టి గాలి మాటలు చెప్పడం కాదని వారికి చిత్తశుద్ధి ఉంటే లేబర్ మినిస్టర్ తో మాట్లాడి శాశ్వత పరిష్కారం చూపాలని అది చేయకుండా దేనికిలి పనికిరాని లెటర్ ప్యాడ్లతో సమస్య పరిష్కారం కాదని ఎద్దేవా చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు శాశ్వత పరిష్కారం చూపాలని లేని యెడల శాసనసభ్యుల తో కలిసి కార్మికుల కోసం ఎక్కడికైనా వెళ్లి నూతన మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బిందుజ సుధీర్ రెడ్డి, కంపెనీ టేకేదారులు భూషణ్ , నరసయ్య, లక్ష్మణ్, కార్మికులు రాజేశ్వర్, చందు, చిన్నయ్య, గణేష్, శ్రీనివాస్, ప్రవీణ్, రవి, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

### - జిల్లా బాలల పరిరక్షణ అధికారి పడాల సురేష్



మల్యాల, జూలై 10 (విజన్ ఆంధ్ర): మల్యాల మండలం కొండగట్టు పరిధిలోని పెద్దమ్మల కాలనీలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన, బడి బయట పిల్లల గుర్తింపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి పడాల సురేష్ మాట్లాడుతూ, పిల్లలందరినీ ఖచ్చితంగా పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. 18 ఏళ్ల లోపు అమ్మాయికి, 21 ఏళ్ల లోపు అబ్బాయికి పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమని.. చట్టాన్ని ఉల్లంఘిస్తే రెండేళ్ల జైలు శిక్ష, లక్ష రూపాయల జరిమానా తప్పవని హెచ్చరించారు. బాల్య వివాహాలు చేసుకుంటే ప్రభుత్వ పథకాలైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వర్తించవన్నారు. ఆపదలో ఉన్న పిల్లల కోసం 1098 చైల్డ్ హెల్ప్ లైన్, 100, 112 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ?పిల్లలను స్కూలుకు పంపించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని హెచ్ఎం రాజయ్య, పిల్లలతో భిక్షాటన చేయిస్తే కఠిన చర్యలు ఉ ంటాయని హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో చైల్డ్? హెల్ప్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ కడారి శ్రావణ్, ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అర్చన, కానిస్టేబుళ్లు మహేందర్, శ్రీకాంత్, జనార్దన్, ఐసిడిఎస్ అంగన్వాడీ టీచర్లు మమత, పద్మ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ గంగాధర్, చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్వైజర్ అశోక్, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి నా ధ్యేయం - కుమ్మరిగూడ సర్పంచ్ పోనమోని శ్రీశైలం యాదవ్

షాబాద్,జూలై 10(విజన్ ఆంధ్ర) : షాబాద్ మండలంలోని కుమ్మరిగూడ గ్రామంలో హెచ్ఎండిఏ నిధులు రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శుక్రవారం గ్రామ సర్పంచ్ పోనమోని శ్రీశైలం యాదవ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామాన్ని అన్ని రంగాలలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు.ప్రజలందరి భాగస్వామ్యంతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు.అన్ని కాలనీలకు సీసీ రోడ్లు,అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు.ఇప్పటికే గ్రామంలో నూతనంగా గ్రామపంచాయతీ కార్యాలయం,సీసీ రోడ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.గ్రామ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని సూచించారు.దశలవారీగా అన్ని కాలనీలలో అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నారమోని భరత్ కుమార్,గ్రామస్తులు,తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగును విస్తరించండి..

## - రైతులకు ఏఎంసీ వైస్ చైర్మన్ పవన్ కుమార్ పిలుపు



నంగునూరు మండలం జూలై 10 విజన్ ఆంధ్ర : తెలంగాణ ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు విస్తరణకు ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం మగ్గంపూర్ గ్రామంలో శుక్రవారం మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు శేరి సురేందర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలను నాటి రైతులకు సాగుపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్ సాధుల పవన్ కుమార్, మండల వ్యవసాయ అధికారి గీత పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఆయిల్ పామ్ రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయకమైన వాణిజ్య పంట అని తెలిపారు.

ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ప్రోత్సాహకాలు, సాంకేతిక సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని సూచించారు. ఆధునిక సాగు విధానాలను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించడంతో పాటు మెరుగైన ఆదాయం పొందవచ్చని వివరించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు పంట నిర్వహణ, నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, మొక్కల సంరక్షణ తదితర అంశాలపై రైతులకు పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో మగ్గంపూర్ సర్పంచ్ పాకాల శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ ఎండి ఇమ్రాన్, శ్రీకాంత్ రెడ్డి, బాపురాజు, చైతన్య, ప్రవళిక, మౌనిక, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ నితీష్, వాసవి యాదమల్లు, బండారు ప్రసాద్ రెడ్డి, అచ్చిన మల్లయ్య, అల్లిబిల్లి నర్సింగరావు, ఎండి ఎస్ దాని, పాలారపు తిరుపతి రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ పరమేశ్వర్ రెడ్డి, ఆంజనేయులు, శంకరయ్య, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు రైతు సోదరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు ఉండాలంటే ఎన్యూమరేషన్ ఫారం బిఎల్ఓ దగ్గరికి వెళ్లి ఇవ్వాల్సిందేనా

**ఇంటింటికి తిరిగి ఓటరు ఫారాలు ఇచ్చారు కానీ తీసుకోవడానికి మాత్రం రావడం లేదు**

**ఫారాలు ఎలా నింపాలో తెలియక తికమకబడుతున్న ఓటర్లు**

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర జులై 9 :ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్ పట్టణం మండలం,కోహెడ చిగురుమామిడి సైదాపూర్ ఎల్కతుర్తి భీమదేవరపల్లి అక్కనపేట మండలాలలో ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని అధికారులు అధికారకంగా ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో ఓటర్ నమోదు పత్రాల పంపిణీలో బిఎల్ఓల తీరు ప్రజల్లో ఆ భద్రత పెంచుతున్నది. ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ మరియు ఫారాలు నింపే క్రమంలో ఏమైనా తప్పులు ఉన్న అనుమానాలు వచ్చినప్పుడు నివృత్తి చేసుకునేందుకు బిఎల్ఓల అవసరం ఉంటుంది. కాని బిఎల్వోల ఆధ్వర్యంలో పూర్తిచేయాలని ఆదేశాలున్నప్పటికీ ఇక్కడ మాత్రం అవేవి పట్టించుకోవడంలేదు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటరు ఫారాలు బిఎల్వోలు ఆర్పీల సహకారంతో ఇంటింటికి తిరిగి ఇచ్చారు. కానీ ఎస్ఐఆర్ ఫారాలు నిరక్షరాస్యులైన ఓటర్లకు ఫారాలు నింపడానికి సహకరించాల్సిన, ఇంటింటికి తిరిగి ఫారాలు తీసుకోవాల్సిన బిఎల్వోలు మాత్రం ఓటరు ఫారం నింపి తీసుకోవడంలో సహకారం అందించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓటరు లిస్టులో మాత్రం ఓటు ఉండాలంటే మీరు మేము కూర్చున్న మావద్దకే వచ్చి ఫారాలు నింపి ఇవ్వాల్సిందే అని బిఎల్ఓలు ఓటర్లకు తేల్చి చెప్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.క్షేత్రస్థాయిలో కూడా అదే జరుగుతుందని రాజకీయ పార్టీల నాయకులు అంటున్నారు..దింతో ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలు ఎలా నింపాలో తెలియక 2002 ఓటర్ లిస్టు లేక, పెళ్లయిన మహిళల వివరాలు ఎలా నింపాలో తెలవక తికమకపడుతున్నారు. మరియు నిరక్షరాస్యులు నిర్ణీత గడువులోగా ఫారాలు ఇవ్వకపోతే ఓటర్ లిస్టులో ఓటు ఉంటుందో లేదో అని ఆందోళనకు గురవుతున్నారు.వివిధ రాజకీయ పార్టీల బిఎల్ఏలు సైతం ఎవరికివారు మా ఓటరు కాదులే అనుకుంటూ ఓటర్లకు సహాయ సహకారాలు కూడా అందించడం లేదని ఓటర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ఎప్పటికప్పుడు బిఎల్ఓలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు దీంతో బిఎల్ఓ ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు వ్యవర్తిస్తున్నారు.ఎస్ఐఆర్ ఫారాలు నింపి ఇవ్వడానికి గడువు దగ్గర పడుతుండడంతో ఇప్పటికైనా అధికారులు గ్రామాలలో ముఖ్యంగా హుస్నాబాద్ పట్టణంలో బిఎల్ఓ లకు అవగాహన కల్పించాలని ఓటర్ల ఇంటింటికి తిరిగి నిరక్షరాస్యులకు ఫారాలు నింపడానికి అధికారులు సహకరించాలని ఓటర్లు పెద్ద ఎత్తున కోరుతున్నారు. ఇట్టి విషయంలో అధికారులు దృష్టి పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది.

# బాధిత కుటుంబానికి పోస్టల్ భీమా పైకం అందుచేత



కారేపల్లి,జులై 10(విజన్ ఆంధ్ర) : కారేపల్లి అంబేద్కర్ నగర్ కాలనీ కి చెందిన చింతల వజ్రం కారేపల్లి పోస్టాఫీస్ లో రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ తీసుకుంది.ఆమె ఇటీవల మృతి చెందటంతో ఆర్పీఎల్ఐ పాలసీ క్లెయిమ్ మొత్తం రూ. 2,19,000/- నామినీ అయిన మృతురాలి భర్త చింతల శ్రీను కు సబ్ పోస్ట్ మాస్టర్ కే.ప్రశాంత్,ఏజెంట్ ఎండీ.రియాజ్ లు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోస్టల్ శాఖ ద్వారా అనేక సేవలు అందించటం జరుగుతుందన్నారు. అనేక పొదుపు పథకాలు,భీమా సౌకర్యం కల్పిస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలు పోస్టల్ శాఖ ద్వారా పారదర్శకంగా అమలు జరుగుతున్నాయని తెలిపారు.

## శ్రీ చక్రేశ్వర శివ మందిరం పాలకవర్గం భాధ్యతలు...

బోధన్, జులై10 (విజన్ ఆంధ్ర) : బోధన్ పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ చక్రేశ్వర శివ మందిరం పాలకవర్గం శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ గా లక్ష్మణ్ రావు పటేల్, ధర్మకర్తలుగా ఆరుగొండ శంకర్, గంగాధర్, వీరప్ప, మౌనిక పోశెట్టి లు శుక్రవారం ఆలయంలో కార్యనిర్వహణ అధికారి రాములు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆలయ అర్చకులు గణేష్ మహారాజ్,మహేష్ పంతులు, శివ కుమార్ ల వేద మంత్రోచ్చరణల నడుమ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా పదవి భాధ్యతలు చేపట్టిన పాలకవర్గానికి పలువురు పుష్పగుచ్చాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధికి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. పదవి భాధ్యతలు అప్పజెప్పిన ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శేఖర్ గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, వీడీసీ అధ్యక్షులు గంగాధర్ రావు పట్వారి, తహసీల్దార్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు...



బోధన్, జులై10 (విజన్ ఆంధ్ర) : బోధన్ శాసనసభ్యులు,ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర గౌడ సంఘ అధ్యక్షులు శేఖర్ గౌడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి లు బోధన్ పట్టణంలో చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ తీరును శుక్రవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నియమించిన ఇన్చార్జుల పర్యవేక్షణలో పట్టణంలోని 26,13,13,36, వార్డులలో చేపడుతున్న సర్ ప్రక్రియ ను పరిశీలించి బిఎల్ఎ ఏజెంట్లను, తహసీల్దార్ విఠల్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు ఎంతో విలువైనదన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయకపోతే అర్హులైన వేలాది మంది ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ?ఈ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కూడా క్షేత్రస్థాయిలో చురుగ్గా పాల్గొని, ప్రజలకు అవగాహన కల్పించి, ఓటు నమోదులో సహాయం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. వారి వెంట పీసీసీ డెలిగేట్ గంగా శంకర్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు దాము, మాజీ అధ్యక్షులు పాషా, యువజన అధ్యక్షులు తలారి నవీన్, కౌన్సిలర్లు, లంక రవి, ఈర్నాల శంకర్, కో ఆప్షన్ సభ్యులు ఇమ్రాన్ తదితరులు ఉన్నారు.

## 25వ వార్డులో రోడ్డు మరమ్మత్తు పనులు...



బోధన్, జులై (10విజన్ ఆంధ్ర) : బోధన్ పట్టణంలోని 25వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తూము శరత్ రెడ్డి తన వార్డులో తాత్కాలికంగా రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు పై ఉన్న గుంతలలో నీరు నిలువ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మిక్సింగ్ కంకర వేసి ట్రాక్టర్ టో చదును చేయించి గుంతలను పూడ్చి వేయించారు.

# 'తాడిచెర్ల కృషి నేడు ఫలించింది'

మందమర్రి, జూలై 10 (విజన్ ఆంధ్ర) : తాడిచెర్ల 2 బొగ్గు గని సింగరేణి సంస్థకు కేటాయించడం పట్ల కార్మిక వర్గం సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ అజీజ్ తెలిపారు. తాడిచెర్ల కృషి నేడు కాంగ్రెస్ పార్టీ కృషితోనే ఫలించిందనీ జిల్లా కార్యదర్శి మహంకాళి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్కేపీ సీ.హెచ్.పి కార్మికుల సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,మంత్రి వివేక్ వెంకటస్వామి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పార్లమెంట్ సాక్షిగా తాడిచెర్ల బొగ్గు గని సింగరేణి సంస్థకే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం,బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి గతంలో తీసుకెళ్లినట్లు వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గాండ్ల సమ్మయ్య,గోపతి భానేష్,బత్తుల వేణు,రాజేష్,మధు,నర్సయ్య,కార్మికులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరాలో అంతరాయం...

బోధన్, జులై 10(విజన్ ఆంధ్ర) : రెండవ శనివారం సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ లో భాగంగా 33/11 కె.వి. బోధన్ సబ్ స్టేషన్ పరిధి బోధన్ పట్టణంలోని అన్ని కాలనీలకు నేడు మధ్యాహ్నం 03 నుండి 03:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ నాయిని కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే 11 కేవీ రాకాసిపేట్ ఫీడర్ మెయింటెనెన్స్, ట్రీ కటింగ్ వలన రాకాసిపేట్ భీముని గుట్ట గల కాలనీలకు మధ్యాహ్నం మూడు నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# ఎమ్మెల్సీ డా. యాదవ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

– గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ చందన రవీందర్

గజ్వేల్, 10 జూలై 2026 (విజన్ ఆంధ్ర) : ఉమ్మడి మెదక్ జిల్లా శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) డా. యాదవ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ ఆయనను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ యాదవ రెడ్డికి చందన రవీందర్ పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజా సేవలో కొనసాగాలని, భగవంతుడు ఆయనకు మరిన్ని ఉన్నత పదవులను ప్రసాదించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.



# విద్యార్థుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం

**- వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు**

**- చేవెళ్లలో ప్రశాంతంగా ముగిసిన విద్యాసంస్థల బంద్**

చేవెళ్ల, జులై 10 (విజన్ ఆంధ్ర): విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలో నిర్వహించిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా, విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ... విద్యార్థుల సమస్యల పట్ల ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సమస్యలను వెంటనే పరిష్కరించాలని,



లేనిపక్షంలో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బంద్‌కు సహకరించిన విద్యాసంస్థల యాజమాన్యాలకు, విద్యార్థులకు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సహాయ కార్యదర్శి మణి గౌడ్, చేవెళ్ల పిడిఎస్యు డివిజన్ అధ్యక్షులు న్యాలట అశోక్, నాయకులు అనిల్, అశోక్, శివప్రసాద్, అశోక్, పవన్ గౌడ్, దశరథ్, బన్నీ, ఫయాజ్, ఫరీద్, వరుణ్, వినయ్, రమేష్, అశోక్, కార్తీక్, కిరణ్, పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలి...

బోధన్, జులై 10(విజన్ ఆంధ్ర) : బోధన్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్, కేజీబీవీ, మైనారిటీ, రెసిడెన్షియల్, సాంఘిక సంక్షేమ ఎయిడెడ్ విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులతో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఎంశ్రీ (జేసీ)లో మండల విద్యాధికారి నాగయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా జూలై 13న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ మొదటి సంవత్సరం వరకు చదువుతున్న 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులందరికీ మధ్యాహ్న భోజనం అనంతరం ఆల్బెండాజోల్ మాత్రలను తప్పనిసరిగా అందించాలని సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సమత, డిప్యూటీ డిఎంహెచ్ఓ విద్య లు మాట్లాడుతూ నులిపురుగుల నివారణ ద్వారా పిల్లల ఆరోగ్యం మెరుగుపడి, పోషకాహార లోపం తగ్గడంతో పాటు విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు.



అందువల్ల ప్రతి విద్యార్థికి తప్పనిసరిగా మాత్ర అందేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. అన్ని విద్యాసంస్థలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫాతిమా, వైద్య సిబ్బంది కిరణ్, రాజు, రవి ఐసిడిఎస్ సిబ్బంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్పిలు పాల్గొన్నారు.

# మందుల షాపులే మల్టిస్పెషలిటీ హాస్పటళ్ళు

విజన్ ఆంధ్ర జులై 11 భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం ముందు మందుల షాపు వెనుక వైద్య సేవల పేరుతో కొన్ని వ్యాపార సముదయాలు బరితేగిస్తున్నాయి, ఎవరు చస్తే మాకేంటంటూ తమ నిర్లక్ష్యానికి ప్రయాణికుల ప్రాణాలు బలిపెడుతున్నారు మరోపక్క ఏజెన్సీ గ్రామాల్లో భారీ దోపిడీకి గిరిజనులు బలవుతున్నారు గ్రామీణ ఏజెన్సీ ప్రాంతాల్లో జరుగుతున్న మెడికల్ మాఫియా అకృత్యాలకు ఎక్కువశాతం గిరిజనులే బలవుతున్నారు అశ్వారావుపేట , దమ్మపేట మండలాల్లో కొన్ని మెడికల్ షాపుల్లోనే రక్త పరీక్ష కేంద్రాలు, మల్టీ స్పెషలిటీ హాస్పిటల్లు నడిపిస్తున్నారు కొందరు ఆర్.ఎం.పి లు. ఆ హాస్పిటల్లో ఉపయోగించిన సిరంజీలు,సూదులు నడి రోడ్లపై పడవేయడం అధికారుల నిర్లక్షానికి ఆ మెడికల్ షాపుల యజమానుల నిర్వాకానికి అసలు సాక్ష్యాలుగా రోడ్లపై సిరంజి సూదులు దర్శనమిస్తున్నాయి.

**ఆర్.ఎం.పి లే హైటెక్ వైద్యులు**

**చీమకుట్టినా యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్**

బలవుతున్న గ్రామీణ ప్రజలు విచ్చలవిడిగా క్లినిక్, ల్యాబ్‌లు కొందరు పీఎంపీ, ఆర్ఎంపీలు లక్షలు గడించిన లక్షాధికారులు ఉన్నారు.అన్ని సదుపాయలు తామే నిర్వహించడంతో చీటికీమాటికి రక్త పరీక్షలు, బ్రాండెడ్ మందుల పేరుతో వెల రూపాయలు దండుకుంటున్నారు అనేది గిరిజన ప్రాంతాల్లో హాట్ టాపిక్ అశ్వారావుపేట మండలం రామన్న గూడెం, దమ్మపేట మండలం మందలపల్లి, మల్కారం గ్రామాల్లో ఆర్ఎంపిల్లో లక్షాధికారులు అయ్యారు అనేది అతిశయోక్తి కానేకాదు ఒకే చోట మెడికల్ షాపు నిర్వహణ అందులోనే హాస్పిటల్

**కాంగ్రెస్ హామీలన్నీ బూటకమేనన్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**

**పేరు మార్పులతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న ప్రభుత్వం**

**రైతు రుణమాఫీ, రైతు భరోసా అమలులో కాంగ్రెస్ విఫలం**

**యూరియా, ధాన్యం కొనుగోళ్లలో రైతాంగం తీవ్ర ఇబ్బందులు**

**రైతు బీమా అందరికీ అమలు చేయకపోతే పోరాటం తప్పదు: బీఆర్ఎస్**

రక్త పరీక్ష కేంద్రాలతో సహా అన్ని సదుపాయలతోనే నిర్వహించబడుతున్నాయి. కాని ఇప్పటికి అధికార యంత్రాంగం కన్నెత్తికూడా అటువైపు చూడకపోవడానికి గల కారణాలు ఏమిటోనని నియోజకవర్గ ప్రజానీకానికి అర్థంకాని ప్రశ్న

మెడికల్ షాపులు రక్త పరీక్ష కేంద్రాలే

దమ్మపేట మండలం మల్కారం గ్రామంలో ఓ ఆర్ఎంపి ద్వారా నిర్వహించబడుతున్న ఒకే చోట అర్హతలు లేకపోయినా ధర్జాగా మెడికల్ షాపు, రక్త పరీక్ష కేంద్రం, హాస్పిటల్ బహిరంగంగా ధర్జాగా నిర్వహిస్తున్న అధికారులు మాత్రం చర్యలు మాత్రం శూన్యమే. గిరిజన ప్రాంతాల్లో కాలు తెగినప్పుడు కట్టు కట్టడానికి మాత్రమే అర్హత ఉన్నవారు, కుట్లు వేయడానికి అర్హత లేనివారు డాక్టర్ బోర్డులు ఏర్పాటు చేసుకుని క్లినిక్‌లు, ల్యాబ్‌లను నిర్వహిస్తున్నారు. మరికొందరు మెడికల్ షాపులు, ఆసుపత్రులు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. సినిమాలో శంకర్‌దాదా ఎంబీబీఎస్ చేయడానికి మోసం చేస్తే, నిజ జీవితంలో ఆర్ఎంపీలు ఏకంగా వైద్యం చేసేస్తున్నారు. అధికారుల





పర్యవేక్షణ లోపం కారణంగా కొన్ని చోట్ల ప్రాణాంతక సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.



**వాడిన సిరంజీలు రోడ్లపైనే**

వైద్య విధానంలో ఉపయోగించిన సిరంజి సూదులు చాలా జాగ్రత్తగా డిస్పోజ్(నాశనం)చేయడం ముఖ్యం వీటికొరకు ప్రత్యేకంగా బయోవాహనం ద్వారా తరలించి ఓ ప్రత్యేకమైన ప్రదేశంలో వాటిని నాశనం చేస్తారు తద్వారా హానికలిగించే వైరస్ బ్యాక్టీరియా లు నాశనం అవుతాయి ఎటువంటి వ్యాధులు సంక్రమించకుండా పలుజాగర్తలు తీసుకోవాలి. కానీ దమ్మపేట మండలం మందలపల్లి మెయిన్ రోడ్డు పక్కనే గల మెడికల్ షాల్లోనే వైద్యం చేస్తూ ఉపయోగించిన సూదులు రోడ్లపై పడేస్తున్నారు. ఆ సిరంజి సూదులవల్ల పక్కనే బస్ స్టాప్ లో ప్రయాణికులు, పదాచారులు ఆ ప్రమాదకర సూదులవాల్ల భయందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇటువంటి కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ప్రయాణికులు వేడుకుంటున్నారు

**డి.డి.ఎం.ఓ భానోత్ నాగలక్ష్మి వివరణ**

ఇటువంటి చర్యలను ఉపేక్షించేది లేదని చర్యకు పాల్పడిన మెడికల్ షాపులపై ప్రోగ్రాం ఆఫీసర్ ద్వారా చర్యలు తీసుకుంటామని తెలియజేసారు.

# రైతు ఆశీర్వాద సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



ఏన్కూరు, జూలై 10(విజన్ ఆంధ్ర): ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో జరుగుతున్న రైతు ఆశీర్వాద సభకు ఏన్కూరు మండలం నుండి వేలాది మంది కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలి వెళ్లారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని గార్లఒడ్డు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వందలాది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు స్వచ్ఛందంగా కదలి వెళ్లారు. సీఎం రేవంత్ రెడ్డి సభకు హాజరవడంతో నేతలు ఉత్సాహంగా సభకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఏరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆదేశాల మేరకు సీఎం సభకు తరలి వెళ్తున్నామన్నారు. రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాలతో రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. సభకు వెళ్లిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ భూక్యా లాలు నాయక్, నాయకులు వరప్రసాద్, మజీద్ ఖాన్, నరసింహారావు, శ్రీనివాసరావు, తదితరులు ఉన్నారు.

# చల్‌గల్‌లో కేవి కి 5 ఎకరాల కేటాయింపు బీజేపీ పోరాట ఫలితమే

- ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం
- మరో 5 ఎకరాలు స్థలం కోసం ఉద్యమిస్తాం
- విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటం కొనసాగుతుంది
- బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ భోగ శ్రావణి

జగిత్యాల, ఆర్ సి జులై 10:(విజన్ ఆంధ్ర ): జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు చల్‌గల్ వాలంతరీ సెంటర్‌లో ఐదు ఎకరాల భూమిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.158ను బీజేపీ స్వాగతిస్తున్నట్లు జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డా. భోగ శ్రావణి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు, ధర్మం, న్యాయం కోసం బీజేపీ చేసిన పోరాటానికి దక్కిన ఫలితమే ఈ నిర్ణయమని అన్నారు. శుక్రవారం కమల నిలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రావణి మాట్లాడుతూ.. కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు చల్‌గల్ వాలంతరి సెంటర్ ప్రాంతమే అనుకూలమని కేంద్రియ విద్యాలయ సంఘటన్ అధికారులు గుర్తించారని అన్నారు. అభివృద్ధి కోసమే పార్టీ మారానని చెబుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కారణంగానే సంవత్సరం కాలయాపన జరిగిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్వార్థపూరితంగా తనకు భూములు ఉన్న చోట కెవి ఏర్పాటు కు స్థలాలు ప్రపోజ్ చేస్తే స్థల పరిశీలనకు వచ్చిన అధికారులు వాటిని తిరస్కరించినట్లు గుర్తు చేశారు. కేంద్రీయ విద్యాలయాన్ని చల్‌గల్ లోనే ఏర్పాటు చేయాలని ఎంపీ ధర్మపురి అరవింద్ చేపట్టిన నిరాహార దీక్షను ఎమ్మెల్యే పోలీసులతో అడ్డుకోవడమే కాకుండా బీజేపీ మహిళా నాయకులని కూడా చూడకుండా అరెస్టు చేసి చేయించి లాక్కెళ్లేలా చేసారని ఆరోపించారు. అయితే చివరికి బీజేపీ నాయకుల పోరాట ఫలితంగా విద్యార్థుల ప్రయోజనాలే గెలిచాయని వ్యాఖ్యానించారు. కాగా ప్రభుత్వం ఐదు ఎకరాల భూమిని కేటాయించడం స్వాగతించదగ్గ నిర్ణయమే అయినప్పటికీ, పూర్తి స్థాయి కేంద్రీయ విద్యాలయానికి 10 ఎకరాల స్థలం అవసరమని శ్రావణి అభిప్రాయపడ్డారు. క్రీడా మైదానం, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇతర మౌలిక వసతుల కోసం అదనంగా మరో ఐదు ఎకరాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జూలై 12న ఎంపీ ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో కేవీ ఏర్పాటు కు భూమిపూజ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కేంద్రీయ విద్యాలయం మంజూరుకు కృషి చేసిన ఎంపీ అరవింద్‌తో పాటు, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని భూమి కేటాయింపుకు సహకరించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు పార్టీ నాయకులు ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమ పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మీడియాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# 9, 10 వ తరగతి చదువుతున్న బీసీ విద్యార్థులకు శుభవార్త

భూపాలపల్లి జిల్లా జులై 10 (విజన్ ఆంధ్ర )జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలోని 9వ, 10వ తరగతి చదువుతున్న బీసీ విద్యార్థులు ప్రీ మెట్రిక్ స్కాలర్ షిప్ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఇందిరా అన్నారు, ప్రభుత్వం బీసీ విద్యార్థులకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది. అర్హత కలిగిన విద్యార్థులకి ఏడాదికి రూ.4000 వేల చొప్పున అందచేయనున్నారని జిల్లా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి తెలిపారు, ఈ అవకాశాన్ని జిల్లా లోని బీసీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా రామభద్రరావు ఏకగ్రీవ ఎన్నిక

దమ్మపేట విజన్ ఆంధ్ర జులై 10 : దమ్మపేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పసుమర్తి రామభద్రరావు మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక వాసవి భవన్‌లో గురువారం నిర్వహించిన మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష పదవి ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష పదవికి నామినేషన్ల స్వీకరణ అనంతరం ఎన్నికల ప్రక్రియను జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దారా యుగంధర్ ఎన్నికల అధికారిగా నిర్వహించారు. నామినేషన్ల పరిశీలన అనంతరం పసుమర్తి రామభద్రరావు ఒక్కరే బరిలో ఉండటంతో ఆయనను ఏకగ్రీవంగా మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈ ప్రకటనతో సభలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. సంఘ సభ్యులు రామభద్రరావును గజ మాల శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పసుమర్తి రామభద్రరావు మాట్లాడుతూ, తనపై మరోసారి నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న మండలంలోని ఆర్యవైశ్య సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు. తన పదవీకాలంలో కుల సంఘ అభివృద్ధికి, సభ్యుల ఐక్యతకు, యువత భాగస్వామ్యానికి, మహిళల ప్రోత్సాహానికి కృషి చేస్తానని అన్నారు. అలాగే వాసవి మాత ఆశయాలకు అనుగుణంగా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తూ సమాజాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. ప్రతి



గ్రామంలోని ఆర్యవైశ్య కుటుంబాలతో సమన్వయం పెంచి, సంఘాన్ని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమనిపేర్కొన్నారు.ఎన్నికల అధికారి దారా యుగంధర్ మాట్లాడుతూ, ఏకగ్రీవ ఎన్నిక సంఘ ఐక్యతకు నిదర్శనమని అన్నారు. నూతన అధ్యక్షుడికి సభ్యులందరూ సహకరించి సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ అసోసియేట్ సభ్యులు దార మల్లికార్జునరావు, అద్దంకి లక్ష్మీనారాయణ, సతీష్, డీపీ, లతో పాటు పట్వారిగూడెం, మల్కారం, ముద్దులగూడెం, మందలపల్లి గ్రామాలకు చెందిన ఆర్యవైశ్య సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారం ఇకనైనా మానుకోలి



బోథ్, జూలై 10. (విజన్ ఆంధ్ర) ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారం మానుకొని అభివృద్ధి పై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ నేత తుల అరుణ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనాల మండలంతో పాటు బోథ్ నియోజకవర్గ అభివృద్ధి గురించి కొందరు చేస్తున్న వ్యాఖ్యలు ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయని అన్నారు. పదేళ్ల పాటు టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఇద్దరు మంత్రులు ఉన్నారు. అదే సమయంలో బోథ్ ఎంపీపీగా కొనసాగిన వ్యక్తి సోనాల మండలం కు, బోథ్ నియోజకవర్గానికి చెప్పుకోదగిన స్థాయిలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఎద్దేవా చేశారు. ఆయన హయంలోనే ఉపాధి హామీ పథకంలో జరిగిన భారీ అవినీతి కారణంగా సంబంధిత ఎంపీడీఓ సస్పెండ్ కావడం ప్రజలకు తెలుసన్నారు. ఆయన ఎంపీపీ గా కొనసాగిన కాలంలో అభివృద్ధి కంటే అవినీతి వార్తలే ఎక్కువగా వినిపించాయని అన్నారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు అభివృద్ధి గురించి గొప్పలు చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని తెలిపారు. ప్రస్తుతం తాను ఎలాంటి ప్రజా ప్రతినిధి పదవిలో లేనప్పటికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారం కోసం నా వంతు కృషి చేస్తున్నానని తుల అరుణ్ కుమార్ అన్నారు. తాను ఎప్పుడూ నేనే తెచ్చాను, నేనే చేశాను అనే వ్యక్తిగత ప్రచారం చేసుకోలేదని అన్నారు. ఇటీవలే సోనాలలో జరిగిన రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా ఈ అభివృద్ధి పని తుల అరుణ్ కుమార్ విజ్ఞప్తి మేరకు మంజూరైందని సభా వేదికపై పేర్కొన్నప్పటికీ తాను దానిని వ్యక్తిగత ప్రచారంగా ఎక్కడా ఉపయోగించుకోలేదని అన్నారు. అధికారంలో లేకపోయినా నేనే తెచ్చాను, నా వల్లే జరిగింది అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం, లేఖలు రాసిన ప్రతి పనిని వ్యక్తిగత విజయంగా ప్రచారం చేసుకోవడం ప్రజలను తప్పుదోవ పట్టించే చర్య. ఇటువంటి రాజకీయ ప్రచారాలకు స్వస్తి పలకాలని అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు పోటీ పడటం సహజం. కానీ మిగతా సమయంలో పార్టీలు, వ్యక్తిగత ప్రచారాలకు అతీతంగా గ్రామాలు, మండలాలు, నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసి పనిచేసి ప్రజాస్వామ్య స్ఫూర్తినీ నిలపాలని పేర్కొన్నారు. సదరు వ్యక్తి ఎవరి ఆశీర్వాదంతో, ఎవరి సహకారంతో వివిధ పదవులు అనుభవించారో నియోజకవర్గ ప్రజలకు, జిల్లా ప్రజలకు బాగా తెలుసనీ ఇకనైనా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారం మానుకొని, అభివృద్ధిపై నిర్మాణాత్మక చర్చ చేయాలని హితవు పలికారు.

# భారత్ ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ భేటీ



**శాలువాతో ఘన సన్మానం..**

**- జ్ఞాపిక అందజేత**

మర్పల్లి, జులై 10 (విజన్ ఆంధ్ర): తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ గురువారం రాత్రి భారత్ ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేశ క్రీడారంగానికి ఆమె అందించిన విశిష్ట సేవలను కొనియాడుతూ శాలువాతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను బహుకరించారు. అనంతరం పీటీ ఉషతో కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించి, దేశంలో క్రీడల అభివృద్ధి, యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించే అంశాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో భారత క్రీడాకారిణిగా విశిష్ట గుర్తింపు పొందిన పీటీ ఉష దేశ యువతకు స్ఫూర్తిదాయకమైన వ్యక్తిత్వమని కొనియాడారు. ఒలింపిక్ ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో, క్రీడాకారులను ప్రోత్సహించడంలో ఆమె చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. పీటీ ఉష కూడా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చూపిన ఆత్మీయతకు కృతజ్ఞతలు తెలిపారు. క్రీడల అభివృద్ధికి ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు గూడెం రాముల యాదవ్, స్పీకర్ వ్యక్తిగత సిబ్బంది, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. భేటీ అనంతరం పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని జ్ఞాపక చిత్రాలు దిగారు.

# బడిలో బోధనకు బదులు... విద్యార్థులతో వ్యక్తిగత పనులు !

**- స్కూల్ వేళల్లో విద్యార్థులతో నిత్యావసర వస్తువులు తెప్పించుకుంటున్న ఉపాధ్యాయులపై ఆరోపణలు**



చేవెళ్ల, జులై 10 (విజన్ ఆంధ్ర): పాఠశాల సమయంలో విద్యార్థులకు విద్యాబోధన చేయాల్సిన ఉపాధ్యాయులే వారితో వ్యక్తిగత పనులు చేయిస్తున్నారనే ఆరోపణలు చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్ద వార్డులోని ప్రాథమికోన్నత పాఠశాలపై వినిపిస్తున్నాయి. పాఠాలు చెప్పాల్సిన వేళల్లో కొంతమంది విద్యార్థులను గ్రామంలోని దుకాణాలకు పంపించి పాలు, నిత్యావసర వస్తువులు తెప్పిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. పాఠశాలకు సంబంధించిన పనులు కాకుండా వ్యక్తిగత అవసరాల కోసం పిల్లలను వినియోగించడం సరికాదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సమయాన్ని ఇలాంటి పనులకు ఉపయోగించడం వల్ల వారి చదువుపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానోపాధ్యాయురాలు సెలవులో ఉన్న సమయంలో ఇలాంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.

# ప్రజాస్వామ్యానికి ఓటే బలం.. ఎస్ఐఆర్‌లో అందరూ పాల్గొనాలి: నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి

షాద్‌నగర్, విజన్ ఆంధ్ర జూలై 10:-- ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి అపోహలకు తావులేదని, ఎన్నికల సంఘం చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని న్యూ సిటీ, క్రిస్టియన్ కాలనీల్లో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు)తో మాట్లాడి, ఓటరు నమోదు కోసం వచ్చిన ప్రజల నుంచి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... ఎస్ఐఆర్ అనేది ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సాధారణ ఓటరు జాబితా సవరణ ప్రక్రియ మాత్రమేనని తెలిపారు. ద్వంద్వ ఓటర్ల తొలగింపు, మరణించిన వారి పేర్ల తొలగింపు, ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాల సవరణ వంటి అంశాలు ఇందులో భాగమని వివరించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్న ఆయన, ప్రతి అర్హుడూ ఓటరుగా నమోదు కావడంతో పాటు తన వివరాలను సరిచూసుకుని అవసరమైన ఫారాలను సమర్పించాలని సూచించారు. స్థానిక ఉపాధ్యాయులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, విద్యావంతులు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల సంఘానికి సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో బీజేపీ టౌన్ కన్వీనర్ శ్రీనివాసాచారి, కౌన్సిలర్ ప్యాట అశోక్, వంశీకృష్ణ, రిషికేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిఎల్ఓ లను అభినంధించిన ఆర్డీఓ...



బోధన్, జులై10 (విజన్ ఆంధ్ర) : బోధన్ శాసన సభ (012) నియోజకవర్గంలోని రాంపూర్ గ్రామానికి చెందిన బిఎల్ఓ సునంద, బండార్పల్లి గ్రామానికి చెందిన బిఎల్ఓ అనసూయ లు సర్ -2026 లో గల డిజిటైజేషన్ ప్రక్రియలో 100శాతం పురోగతి సాధించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆర్డీఓ విజయకుమారి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయం పరిపాలన అధికారి ఈ.సాయిలు, బోధన్ తహసీల్దార్ పీ.విఠల్, నాయిబ్ తహశీల్దార్ నాగమణి, సీనియర్ అసిస్టెంట్ సుశీల, బోధన్ మండల ప్రణాళికా, గణాంకాల అధికారి అశోక్, ఆపరేటర్ ముస్తఫా లు పాల్గొని సునంద, అనసూయ ల సేవలను అభినందిస్తూ కొనియాడారు. ఈ సందర్భంగా సునంద, అనసూయ లు మాట్లాడుతూ, తమ పోలింగ్ స్టేషన్ పనులు 100శాతం పూర్తి చేసినట్లు తెలిపారు.

# ఇక రోడ్లపై భారీ చెత్తకు చెక్..!

**ప్రతి శనివారం ఇంటి వద్ద నుంచే బల్కీ వ్యర్థాల ఉచిత సేకరణ**

**-గాజులరామారం వార్డులో మున్సిపాలిటీ ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమశీ**

**-క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదు నమోదు.. ఇంటి వద్దకే సిబ్బంది**

**-పాత మంచాలు, సోఫాలు, అల్మారాలు, ఫర్నిచర్ ఉచితంగా తరలింపు**

**-రోడ్లు, ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పడేయొద్దని హెచ్చరిక**

**-పరిశుభ్ర వార్డు నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం కోరిన అధికారులు**

**-ప్రత్యేక డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ పిలుపు**

గాజులరామారం, జూలై 10 (విజన్ ఆంధ్ర): గాజులరామారం వార్డులో పరిశుభ్రతకు మరింత ప్రాధాన్యం కల్పిస్తూ మున్సిపల్ యంత్రాంగం వినూత్న చర్యలు చేపట్టింది. ఇళ్లలో ఉపయోగం లేకుండా పేరుకుపోయే భారీ గృహ వ్యర్థాల (బల్కీ వేస్ట్) నిర్వహణకు ప్రతి శనివారం ప్రత్యేక సేకరణ డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించింది. దీంతో రోడ్లు, కాలనీలు, ఖాళీ స్థలాల్లో పేరుకుపోతున్న భారీ చెత్తకు చెక్ పడనుంది. ఇళ్లలో పనికిరాక పడి ఉన్న చెక్క మంచాలు, పరుపులు, సోఫాలు, కుర్చీలు, అల్మారాలు, టేబుళ్లు, ఇతర భారీ ఫర్నిచర్‌ను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా మున్సిపాలిటీ అందిస్తున్న ఉచిత సేవను ప్రజలు వినియోగించుకోవాలని అధికారులు సూచించారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఫిర్యాదు నమోదు చేస్తే, సంబంధిత వివరాల ఆధారంగా ప్రతి శనివారం మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది నేరుగా ఇంటి వద్దకు చేరుకుని భారీ వ్యర్థాలను ఉచితంగా సేకరిస్తారు. బహిరంగ ప్రదేశాల్లో భారీ వ్యర్థాలను పడేయడం వల్ల పారిశుద్ధ్య సమస్యలు, దోమలు, క్రిమికీటకాల వ్యాప్తి, పర్యావరణ కాలుష్యం పెరిగే ప్రమాదం ఉందని అధికారులు పేర్కొన్నారు. నగర సౌందర్యాన్ని కాపాడేందుకు ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గాజులరామారం వార్డును పరిశుభ్రతలో ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దాలంటే ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రతి శనివారం నిర్వహించే ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్కిల్--57 (గాజులరామారం), కుత్బుల్లాపూర్ జోన్ డిప్యూటీ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే అక్రమంగా భారీ చెత్త పారబోయడం గణనీయంగా తగ్గడంతో పాటు వార్డు పరిశుభ్రత మరింత మెరుగుపడుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# TUFIDC ప్రత్యేక నిధులతో 14వ వార్డులో కోటి రూపాయలకు పైగా అభివృద్ధి పనులు పూర్తి



**చేసిన ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాష్ రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు**

**- మాజీ కౌన్సిలర్ మార్క ఉమాదేవి రఘుపతి గౌడ్**

పరకాల విజన్ ఆంధ్ర జూలై 10 : పరకాల మున్సిపాలిటీ 14వ వార్డులో గత 30 సంవత్సరాలుగా ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెట్టిన అంతర్గత డ్రైనేజీ సమస్యను, ముఖ్యంగా శ్రీ చెన్నకేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో నెలకొన్న సమస్యలను మాజీ కౌన్సిలర్ మార్క ఉమాదేవి రఘుపతి గౌడ్ ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

ప్రజల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారం కోసం అంతర్గత డ్రైనేజీతో పాటు సీసీ రోడ్ల నిర్మాణానికి 2024లో మార్కింగ్ చేపట్టగా, మాజీ కౌన్సిలర్ మార్క ఉమాదేవి రఘుపతి గౌడ్ కృషితో దాదాపు రూ.1 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి.

ఆ ప్రతిపాదనలకు ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాష్ రెడ్డి సానుకూలంగా స్పందించి, 2025లో TUFIDC ప్రత్యేక నిధుల ద్వారా 14వ వార్డులోనే మొదటగా పనులు ప్రారంభించి, ప్రస్తుతం 95 శాతం పనులను పూర్తి చేశారు. ఇందులో పాత మసీదు గల్లీ సీసీ రోడ్డు నిర్మాణం కూడా పూర్తయింది.

ఈ రోడ్డు కోసం 2024లో మున్సిపల్ అత్యవసర బడ్జెట్‌లో నిధులు కేటాయించి శంకుస్థాపన జరిగినప్పటికీ, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పనులు ప్రారంభం కాలేదు. అనంతరం ఎమ్మెల్యే అదే పనిని TUFIDC నిధుల ద్వారా మంజూరు చేసి పూర్తి చేయించడం విశేషం.

ఈ అభివృద్ధి పనులతో 14వ వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాష్ రెడ్డి దూరదృష్టిని, మాజీ కౌన్సిలర్ మార్క ఉమాదేవి రఘుపతి గౌడ్ నిరంతర కృషిని అభినందిస్తున్నారు.

-14వ వార్డు చరిత్రలో నిలిచిపోయేలా కోటి రూపాయలకు పైగా అభివృద్ధి పనులు పూర్తి చేసిన ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాష్ రెడ్డి మాజీ కౌన్సిలర్ మార్క ఉమాదేవి రఘుపతి గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూహెచ్ కళాశాలకు బస్సుల సౌకర్యం..

**- నేడు ప్రారంభించనున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ**



చౌటకూర్ జూలై 10 (విజన్ ఆంధ్ర) : చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాలకు రవాణా సౌకర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ద్వారా కళాశాలకు రెండు బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ బస్సుల ద్వారా విద్యార్థులు, విద్యార్థినులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది సౌకర్యవంతంగా ప్రయాణించనున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూహెచ్ కళాశాలకు నేరుగా బస్సు



సౌకర్యం కల్పించడంతో విద్యార్థుల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.
కళాశాలకు ఒక బస్సును పూర్తిగా కేటాయించగా, మరో బస్సును విద్యార్థులు, అధ్యాపకుల అవసరాలకు అనుగుణంగా నడపనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ బస్సు సేవలను శనివారం మంత్రి దామోదర్ రాజనర్సింహ జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాల సందర్శన సందర్భంగా అధికారికంగా ప్రారంభించనున్నారు.
అదే రోజు జేఎన్‌టీయూహెచ్ వైస్ చాన్సలర్ డాక్టర్ టి. కిషన్ కుమార్ రెడ్డి పాల్గొనే కార్యక్రమంలో కళాశాలకు సంబంధించిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెల్లడించారు.




# కొయ్యూరు నూతన ఎస్ఐని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

మల్హర్, జూలై 10 విజన్ ఆంధ్ర : కొయ్యూరు పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ మహేందర్ కుమార్‌ను మల్హర్ రావు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, గ్రామీణ వైద్యుల మండల ప్రధాన కార్యదర్శి మాజీ ఎడ్లపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు జంగిడి సమ్మయ్య, వార్డు మెంబర్ మెరుగు శ్రీనివాస్, యూత్ నాయకులు చింతకింది సురేష్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఎస్ఐ మహేందర్ కుమార్ ను శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు ఎల్లప్పుడూ తమ పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

# ఓటరు జాబితా సవరణను పరిశీలించిన తహసీల్దార్లు



**- పుల్కల్, చౌట్కూర్ మండలాల తహసీల్దార్లు కృష్ణ, నామాల కిష్టయ్య**

చౌటకూర్ జూలై 10 (విజన్ ఆంధ్ర):- భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పుల్కల్, చౌటకూర్ మండలాల తహసీల్దార్లు కృష్ణ, నామాల కిష్టయ్య శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
చౌటకూర్, పుల్కల్ మండలాల పరిధిలోని గొంగ్లూరు, పోసానిపల్లి, బొమ్మారెడ్డిగూడెం, ఉప్పరిగూడెం, శేరిరాంరెడ్డిగూడెం గ్రామాల్లో బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను వారు స్వయంగా తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్యుమరేషన్ ఫారాల సేకరణను వేగవంతం చేసి పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తహసీల్దార్లు మాట్లాడుతూ, ఓటర్ల ప్రత్యేక సవరణ కార్యక్రమానికి ఎన్నికల సంఘం నెల రోజుల గడువు కేటాయించిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత బూత్ స్థాయి అధికారులతో పాటు రాజకీయ పార్టీల బూత్ స్థాయి ప్రతినిధులపై కూడా ఉందన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేసి, పూర్తిగా నింపించి వెంటనే సేకరించాలని బూత్ స్థాయి అధికారులను ఆదేశించారు. పూరించిన ఫారాలను సమర్పించేందుకు ఈ నెల 24వ తేదీని చివరి గడువుగా నిర్ణయించినట్లు తెలిపారు. నిర్ణీత గడువులోగా డిజిటైజేషన్ ప్రక్రియను పూర్తి చేసేలా సవరణ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని సూచించారు. సర్వే సమయంలో ఇళ్ల వద్ద అందుబాటులో లేని ఓటర్ల వివరాలను సేకరించి, వారికి ఫోన్ ద్వారా సమాచారం అందించి ఫారాలు పూర్తి చేయించాలన్నారు. ఓటరు సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఫారాల నింపకంలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రత్యేకంగా 2002 సంవత్సరం ఓటరు జాబితాలో ఓటరు పేరు ఎక్కడ నమోదై ఉందో ఆ వివరాలను ఎన్యుమరేషన్ ఫారంలో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. అలాగే ఓటరు గుర్తింపు కార్డు నవీకరణ కోసం పాత ఫోటోతో పాటు తాజా రంగు ఫోటోను అతికించి, పుట్టిన తేదీ, ఆధార్ నంబర్ వంటి వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. తమ వ్యక్తిగత వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా బూత్ స్థాయి అధికారులకు అందించడం ప్రతి ఓటరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ జాతీయ ప్రాధాన్యత కలిగిన కార్యక్రమానికి స్థానిక సర్పంచులు, వార్డు సభ్యులు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ పరిశీలన కార్యక్రమంలో గొంగ్లూరు సర్పంచ్ జైపాల్ నాయక్, గిర్దావర్, పుల్కల్ గ్రామ పంచాయతీ అధికారి సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, బూత్ స్థాయి అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ముదిమాణిక్యంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం



చౌటకూర్ జూలై 10 (విజన్ ఆంధ్ర) పుల్కల్ మండల పరిధిలోని ముదిమాణిక్యం గ్రామంలో పీడీజీ రాజ్ జీ పథకం కింద మంజూరైన రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లన్నగారి దుర్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై టెంకాయ కొట్టి పనులను ప్రారంభించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవ ఈ సందర్భంగా దుర్గారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో గ్రామాభివృద్ధి కోసం రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామంలో చాలా కాలంగా సిమెంట్ రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు గ్రామాలు, తండాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోగులయ్య, ప్రభుగౌడ్, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కుత్బుల్లాపూర్ కాంగ్రెస్‌కు కొత్త జోష్

**-24 డివిజన్ అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులకు నియామక పత్రాల అందజేత**

**-టీపీసీసీ అధ్యక్షుడు బొమ్ము మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు కార్యక్రమ**

**-జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో నియామక పత్రాల పంపిణీ**

**-నూతన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని కొలన్ హనుమంత్ రెడ్డి సూచన**

**-క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని భూపతిరెడ్డి పిలుపు**

**-ప్రజలతో మమేకమై కాంగ్రెస్ సిద్ధాంతాలను విస్తృతంగా చాటాలని నాయకుల సూచన**

**-ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నాయకులు, మహిళా కాంగ్రెస్ నేతలు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు**

కుత్బుల్లాపూర్, జూలై 10 (విజన్ ఆంధ్ర): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులు బొమ్ము మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 24 డివిజన్‌లకు నూతనంగా నియమితులైన కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులకు నియామక పత్రాలను శుక్రవారం ఘనంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హనుమంత్ రెడ్డి, మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి నూతనంగా నియమితులైన నాయకులకు నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొలన్ హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతంలో డివిజన్ అధ్యక్షుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి చేర్చేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా సేవాభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. నర్సారెడ్డి భూపతిరెడ్డి మాట్లాడుతూ, కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి నిజమైన బలమని అన్నారు. రాష్ట్ర నాయకత్వం చేపడుతున్న కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో విజయవంతం చేస్తూ, పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి నాయకుడు సమష్టిగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, నూతనంగా నియమితులైన డివిజన్ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన నాయకులకు అభినందనలు తెలియజేశారు

# బహదూర్‌పల్లిలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలపై ఉక్కుపాదం



**-42 అక్రమ నిర్మాణాల తొలగింపు.. పాదచారులకు ఊరట**
**- బహదూర్‌పల్లి చౌరస్తా నుంచి ఎస్‌వీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వరకు ప్రత్యేక డ్రైవ్**
**- రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన నిర్మాణాల కూల్చివేత**
**- ట్రాఫిక్‌కు ఆటంకం, ప్రమాదాల నివారణే లక్ష్యమన్న అధికారులు**
**- ప్రభుత్వ భూముల ఆక్రమణలను ఉపేక్షించబోమని హెచ్చరిక**
**- నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు, కఠిన చర్యలు**
**- డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్ ఆధ్వర్యంలో తనిఖీలు**

దుండిగల్, జూలై 10 (విజన్ ఆంధ్ర): నగరంలో పాదచారుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యల్లో భాగంగా బహదూర్‌పల్లి పరిధిలో మున్సిపల్ అధికారులు శుక్రవారం ప్రత్యేక ఆక్రమణల తొలగింపు డ్రైవ్ నిర్వహించారు. బహదూర్‌పల్లి చౌరస్తా నుంచి దూలపల్లి రోడ్డులోని ఎస్‌వీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించిన 42 అక్రమ నిర్మాణాలను జేసీబీల సహాయంతో తొలగించారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించబడటంతో పాదచారులు రహదారిపై నడవాల్సిన పరిస్థితి ఏర్పడి, తరచూ ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, ఫుట్‌పాత్‌లు, ప్రజా మార్గాలను ఆక్రమించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఇకపై ఎలాంటి ఆక్రమణలను సహించబోమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై భారీ జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు తమ వస్తువులు, నిర్మాణాలను ఫుట్‌పాత్‌లపై ఉంచకుండా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సహకరించాలని సూచించారు. నగరంలో ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని రానున్న రోజుల్లో కూడా నిరంతరంగా కొనసాగిస్తామని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణికరణ్, ఏసీపీ శ్రీనివాస్, టీపీఎస్ ముఖేష్ సింగ్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, మున్సిపల్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంపిడిఓ. కార్యాలయాలంలో పైకప్పు ఊడింది..





**- తప్పిన ప్రమాదం**
**- వెంటనే నూతన భవనం నిర్మించాలి**
**- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.రామచంద్రారెడ్డి**

అయిజ జూలై 10 (విజన్ ఆంధ్ర) :జోగులాంబ గద్వాల జిల్లా అయిజ ఎంపీడీవో ఆఫీసులో కంప్యూటర్ గదిలో పైకప్పు ఊడిపడి ఉన్నది, అదృష్టవసాధన ఆ ప్రమాదం జరిగినప్పుడు గదిలో ఎవరూ లేకపోవడం వలన ప్రమాదం తప్పింది. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ

ముఖ్యంగా ఎంపీడీవో ఆఫీస్, ఎమ్మార్వో ఆఫీస్ నాసిరకం కట్టడం వలన గదులలో ఇదే సమస్య ఉన్నది. ఈజీఎస్ ఆఫీసు కాని, ఇతర గదులలో అతి త్వరలో ప్రమాదం జరిగే అవకాశం ఉన్నది. అయిజ పిఎచ్సీ లో కూడా గతంలో ఇదేవిధంగా పైకప్పు ఊడిపడి నది అప్పుడు కూడా అదృష్టవశాత్తున ఎవరూ లేకపోవడం వలన భారీ ప్రమాదం తప్పినది అన్నారు. దీనితోపాటు బియుపిఎస్. స్కూల్ లో కూడా దాదాపు అన్ని గదులలో ఇదే సమస్య ఉందని,అదేవిధంగా మండలంలో పలు కార్యాలయంలో ఇదే సమస్య ఉన్నదని తెలిపారు. బీసీ హాస్టల్ లో కూడా ఇదే సమస్య ఉంది. మండలంలో వివిధ గ్రామాలలో ఇదే సమస్య ఉన్నది కాబట్టి సంబంధిత అధికారులు ,కలెక్టర్ పర్యవేక్షించి ఎక్కడ ఎక్కడ ఈ సమస్య ఉన్నదో డిస్మెంటల్ చేసి వాటి స్థానం లో నూతన భవనాలను నిర్మించి ఉద్యోగస్తులు, విద్యార్థులు, ప్రజల యొక్క ప్రాణాలు కాపాడాలని భారతీయ జనతా పార్టీ తరఫున కోరుతున్నామని అన్నారు. దురదృష్టవశాత్తున ఏదైనా సరే ప్రాణ నష్టం జరిగితే దీనికి బాధ్యులు ఎవరు ప్రాణ నష్టం జరగకముందే అధికారులు మేల్కొని బిల్డింగులను పునరుద్దించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి అయిజ మండల అధ్యక్షులు గోపాలకృష్ణ, పట్టణ ఉపాధ్యక్షులు లక్ష్మణ్ గౌడ్, నాయకులు భీమన్న, రామకృష్ణ, లక్ష్మన్న, శంకర్ , మారెన్న, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల మరమ్మతులు పూర్తి చేసే వరకు.. ఇసుక లారీల రవాణాను నిలుపుదల చేయాలి

వెంకటాపురం జూలై 10 (విజన్ ఆంధ్ర): శుక్రవారం చిట్టెం ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి గ్యానం వాసూ మాట్లాడుతు..గత నాలుగు సంవత్సరాలుగా చర్ల వెంకటాపురం ప్రధాన రహదారి పూర్తిస్థాయిలో ధ్వంసమై ప్రజలు నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణాలు సాగిస్తున్నారని, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి తమ లక్ష్యం అని చెప్పుకునే అధికార పార్టీ ఎమ్మెల్యే హామీలు, మాయమాటలతో

ప్రజలను మభ్య పెట్టడానికి సరిపోతుందని విమర్శించారు.

రోడ్ల దుస్థితిపై ఎమ్మెల్యే నోరు మెదపడం లేదని, ఒక్క ప్రెస్ మీట్ పెట్టి చేతులు దులుపుకున్నారని విమర్శించారు, రోడ్ల మరమ్మతులకు నిధులు ఎక్కడి వరకు వచ్చాయో ఎమ్మెల్యే మండల ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో చర్ల ఇసుక లారీలను వెంకటాపురం మీదుగా వస్తే చర్యలు తీసుకుంటానని ప్రకటించిన హామీ ఎందుకు నీరు కారిపోయిందో చెప్పాలని డిమాండ్ చేశారు .

" అసలే ములుగే నక్కపై తాటి పండు పడినట్లుగా" అసలే రోడ్లు బాగు లేకుండా ఉంటే పక్క జిల్లా లారీలు వేలాదిగా మండలం పై నుండి తరలించటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు అర్ అబి శాఖ ఉన్నత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు .మండలంలో 45 కిలోమీటర్లు ప్రధాన రహదారి ఇసుక లారీల రాకపోకల వల్ల గుంతలు మయంగా మారిందని అన్నారు, వర్షపు నీటితో గుంతలు కనిపించకపోవడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయని, మండలంలో ఇప్పటికే అనేక ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు అత్యవసర సేవలు, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, గర్భిణీలు, రోగులు తమ గమ్యస్థానానికి చేరుకోవడానికి నిత్యం నరకం అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు

దీంతోపాటు రోడ్లు దుస్థితి, గుంతల వల్ల భద్రాచలం ఆర్టీసీ డిపో వారు బస్ సర్వీస్ లను నిలుపుదల చేసే ఆలోచనలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు ప్రజలందరూ కలిసి వస్తే చర్ల ఇసుక లారీలను అడ్డుకుంటామని ఈ సందర్భంగా తెలియజేశారు ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కుమ్మరి శీను మండల కమిటీ సభ్యులు, కంఠం సత్యం, గుండమల్ల ప్రసాదు, బోగటజవిజయకుమార్, సాధన పెల్లి దేవి,సుహాసిని, శీను, మాణిక్యం, కట్ట మహేశ్వర రావు, సత్యవతి, పుష్ప, తదితరులు పాల్గొన్నారు

## ఎన్‌హెచ్‌ఎం కింద ఖాళీ పోస్టుల భర్తీకి

# దరఖాస్తుల ఆహ్వానం

**- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. సంధ్య కిరణ్మయి**

గద్వాల జూలై 10 (విజన్ ఆంధ్ర) జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశానుసారం జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. సంధ్య కిరణ్మయి ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద బస్తీ దవాఖానలో మెడికల్ ఆఫీసర్ -- 1 పోస్టు, ల్యాబ్ టెక్నీషియన్ -- 3 పోస్టులు, సీనియర్ ట్యూబర్క్యులోసిస్ లాబొరేటరీ సూపర్వైజర్ (ఎస్ టి ఎల్ ఎస్) -- 2 పోస్టులు కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ https://gadwal.telangana.gov.in ను సందర్శించాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను అవసరమైన ధ్రువపత్రాలతో కలిసి 13-07-2026 నుండి 17-07-2026 సాయంత్రం 5.00 గంటలలోపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం, ప్రథమ అంతస్తు, ఐడీఎస్ కాంప్లెక్స్, జోగులాంబ గద్వాలలో సమర్పించాలని సూచించారు.

# ట్రాఫిక్ సమస్యపై మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం

కొత్తకోట జులై 10 (విజన్ ఆంధ్ర) : కొత్తకోట పట్టణంలోని నాలుగు రోడ్ల ట్రాఫిక్ సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని సిపిఎం మండల పార్టీ కార్యదర్శి బొబ్బిలి నిక్సన్ శుక్రవారం నాడు మున్సిపల్ కమిషనర్ సైదయ్యకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్తకోటపట్టణంలో మదనాపూర్ రోడ్డులో రోడ్డు వెడల్పు లేకపోవడం వల్ల ఎన్నో యాక్సిడెంట్లు అయ్యి ఎంతోమంది చనిపోయారని ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు హైదరాబాద్ రోడ్డు నుండి కర్నూల్ వైపు 40 ఫీట్లు వెడల్పు చేశారు కానీ రోడ్డుపై వ్యాపారాలు కొనసాగడంతో వాహనదారులకు బాట సారులకు విద్యార్థులకు తీవ్ర ట్రాఫిక్ సమస్య అధికంగా ఉ ందని వెంటనే 4 0ఫీట్ల రోడ్డు వెడల్పులో షాపుల ముందు పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసి పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు స్టేట్ బ్యాంకు ఆంధ్ర బ్యాంకు దగ్గర మరియు మదనాపురం రోడ్లో చౌరస్తా నుండి మటన్ మార్కెట్ వరకు అదేవిధంగా మున్సిపల్ ఆఫీస్ నుండి పాత జూనియర్ కళాశాల వరకు ఆర్టీసీ బస్టాండ్ నుండి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు నాలుగు రోడ్ల వైపుల ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వీటితోపాటు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని వారు చెప్పారు అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని వారు ఆరోపించారు ప్రజలకు ఇబ్బంది కలిగించే ట్రాఫిక్ సమస్యను తొలగించాలని కోరారు ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ తాపీ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కే వెంకటయ్య కొత్తకోట టౌన్ అధ్యక్షులు నాగరాజు కా నయపల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు రాజు నారాయణ నరేందర్ ఎమ్ రాములు వెంకటేష్ ఎం నరేష్ రాము తదితరులు పాల్గొన్నారు



# రోబోటిక్ టెక్నాలజీతో క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో విప్లవాత్మక మార్పులు



**-ఆంకాలజిస్ట్,సర్జికల్ వైద్యులు చిన్నబాబు సుంకవల్లి**

నిజామాబాద్, జూలై 10:( విజన్ ఆంధ్ర ) ఫ్లోరోసెన్స్ గైడెడ్, రోబోటిక్ టెక్నాలజీతో క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ ఆంకాలజిస్ట్,సర్జికల్ వైద్యులు చిన్నబాబు సుంకవల్లి తెలిపారు. గురువారం నగరంలోని ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్జికల్, ఆంకాలజీ వైద్యులు చిన్నబాబు సుంకవల్లి మాట్లాడుతూ.. గత దశాబ్దంలో క్యాన్సర్ చికిత్సలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ట్యూమర్ బయాలజీపై మెరుగైన అవగాహన పెరగడంతో, నేటి క్యాన్సర్ శస్త్రచికిత్సల లక్ష్యం కేవలం వ్యాధిని తొలగించడం మాత్రమే కాకుండా, రోగికి మంచి జీవన నాణ్యతను అందిస్తూ పూర్తి నయం చేయడం. ఈ మార్పులో అత్యంత ముఖ్యమైన సాంకేతిక ఆవిష్కరణలలో ఒకటి రోబోటిక్ శస్త్రచికిత్స, ఫ్లోరోసెన్స్ గైడెడ్ సర్జరీ. ఈ ఆధునిక టెక్నాలజీలు అత్యంత ఖచ్చితత్వం, తక్కువ టిష్యూ డ్యామేజ్, తక్కువ రక్తనష్టం మరియు వేగవంతమైన కోలుకునే అవకాశాలను అందిస్తున్నాయన్నారు . హై-డెఫినిషన్ 3డి విజన్, ట్రెమర్-ఫ్రీ ఇన్‌స్ట్రుమెంట్స్, మనిషి చేతి కదలికలను అనుకరించే వ్రిస్టెడ్ ఇన్స్టుమెంట్ ద్వారా క్లిష్టమైన శస్త్రచికిత్సలను అత్యంత నైపుణ్యంతో నిర్వహించవచ్చు అని తెలిపారు.సాధారణంగా చెప్పాలంటే, పెద్ద కోతలు లేకుండా కేవలం 8 ఎం ఎం చిన్న రంధ్రాల ద్వారా శస్త్రచికిత్స నిపుణుడు తన చేతులు శరీరం లోపల పనిచేస్తున్నట్లుగా ఆపరేషన్ చేయగలుగుతారన్నారు.దీని వలన రోగికి తక్కువ నొప్పి, చిన్న మచ్చలు, తక్కువ రక్తనష్టం కలుగుతుంది. ఇంకా స్మార్ట్ టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏ ఐ) కలయికతో శస్త్రచికిత్సలు మరింత ఖచ్చితంగా, సురక్షితంగా మారుతున్నాయన్నారు.క్యాన్సర్ శస్త్రచికిత్సల్లో ఫ్లోరోసెన్స్-గైడెడ్ రోబోటిక్ టెక్నాలజీ ఒక విప్లవాత్మక మార్పును తీసుకువచ్చాయని, ప్రత్యేకమైన ఫ్లోరోసెంట్ రంగులను ఉపయోగించి క్యాన్సర్ కణాలను మెరిసేలా చేయడం ద్వారా, రోబోటిక్ చేతులతో అత్యంత కచ్చితత్వంతో శస్త్రచికిత్సలు చేయడం సాధ్యమవుతుందన్నారు. దీనివల్ల ఆరోగ్యకరమైన కణజాలం దెబ్బతినకుండా కేవలం కణితిని మాత్రమే సురక్షితంగా తొలగించవచ్చని,

రోబోటిక్ ఫ్లోరోసెన్స్ గైడెడ్ పద్ధతుల ద్వారా శస్త్రచికిత్స చేయడం వలన రక్తస్రావం చాలా తక్కువగా ఉంటుందన్నారు.రోగులు ఆసుపత్రిలో తక్కువ రోజులు ఉండవలసి వస్తుందని సాధారణ జీవితానికి త్వరగా కోలుకుంటారన్నారు.

తక్కువ నొప్పి,తక్కువ రక్తనష్టం,తక్కువ ఆసుపత్రి రోజులు,త్వరగా పనికి తిరిగి వెళ్లే అవకాశం,మెరుగైన జీవన నాణ్యత,తక్కువ మచ్చలు, కుటుంబ, భావోద్వేగ ఆర్థిక ఒత్తిడి తగ్గడం వంటివి రోగులకు కలిగే ప్రధాన ప్రయోజనాలు అని తెలిపారు. ఈ విధంగా రోబోటిక్, ఫ్లోరోసెన్స్ గైడెడ్ టెక్నాలజీలు క్యాన్సర్ శస్త్రచికిత్సలను కేవలం వ్యాధి నివారణకే పరిమితం చేయకుండా, రోగి జీవన నాణ్యతను కాపాడే దిశగా ముందుకు తీసుకెళ్తున్నాయన్నారు.

క్యాన్సర్‌ను నయం చేయడమే కాదు, రోగి జీవితాన్ని మరింత మెరుగ్గా మార్చడం కూడా ఆధునిక శస్త్రచికిత్సల లక్ష్యం అని తెలియజేశారు. ఈ సమావేశంలో హైటెక్ సిటీ యశోద హాస్పిటల్ పిఆర్వో మధు తదితరులు పాల్గొన్నారు.

# మారేళ్లపాడు ప్రాజెక్టు పనులు వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందించాలి



అశ్వాపురం, జూలై 10. విజన్ ఆంధ్ర : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,అశ్వాపురం మండల పరిధిలోని, బీ. జి . కొత్తూరు పంప్‌హౌస్ సమీపంలో నిర్మాణంలో ఉన్న మారేళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు శుక్రవారం పరిశీలించారు. ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి పనులను వేగవంతం చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ "మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో సీతారామ ఎత్తిపోతల పథకంతో పాటు అనేక ప్రతిష్టాత్మక సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించారని గుర్తు చేశారు. సీతారామ ప్రాజెక్టులో భాగమైన మారేళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఈ ప్రాంత రైతులకు ఎంతో కీలకమైందని పేర్కొన్నారు.

ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి స్థానిక రైతాంగానికి సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని అన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రారంభించిన సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీలో చేరిన తెలంగాణ ఉద్యమ నేత సామాజిక కార్యకర్త మీసాల ఫౌండేషన్ వ్యవస్థాపకులు మీసాల శ్రీనివాసరావు...

**జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్...**



నిజామాబాద్ జులై 10:( విజన్ ఆంధ్ర ) : నిజామాబాద్ జిల్లాకు చెందిన తెలంగాణ ఉద్యమ నేత సామాజిక కార్యకర్త మీసాల ఫౌండేషన్ అధినేత మీసాల శ్రీనివాసరావు శుక్రవారం రోజున హైదరాబాద్ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నివాసంలో జనసేన పార్టీలో చేరారు.అనంతరం జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చేతుల మీదుగా మీసాల శ్రీనివాసరావుకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ మీసాల శ్రీనివాస్ తమకు 20 సంవత్సరాల అనుబంధం కలదని అదే విధంగా మీసాల ఫౌండేషన్ చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో సంతోషకరమని అన్నారు. అనంతరం జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ప్రజలకు చేరువై జనసేన సిద్ధాంతాలను విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం మీసాల ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ జనసేన సిద్ధాంతాలు ప్రజా సేవకు పార్టీ కట్టుబాటు పవన్ కళ్యాణ్ నాయకత్వంపై విశ్వాసంతో చేరినట్లు తెలిపారు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు..

# జోయాలుక్కాస్ లో 'బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో' ఉత్సవం

నిజామాబాద్ జూలై 10: (విజన్ ఆంధ్ర)తెలంగాణ ది వరల్డ్స్ ఫేవరెట్ జ్యువెలర్ జోయాలుక్కాస్, జూలై 10, 2026 నుండి తన నిజామాబాద్ షోరూమ్‌లో బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షోతో వినియోగదారులను మంత్రముగ్ధులను చేయడానికి సిద్ధంగా ఉంది అని నిర్వాహకులు తెలిపారు.ఈ ప్రత్యేక ప్రదర్శన వజ్రాభరణాలలో కళాత్మకత, సొగసు మరియు నవీనత యొక్క అసాధారణ వేడుకను వాగ్దానం చేస్తుంది.

అద్భుతమైన వధువుల ఆభరణాల నుండి రోజువారీ ధరించడానికి చక్కటి సమకాలీన డిజైన్‌ల వరకు విభిన్నమైన శ్రేణిని కలిగి ఉన్న ఈ ప్రదర్శన, నిలిచే హస్తకళను మరియు ఆధునిక అభిరుచులను ఏకతాటిపైకి తీసుకువస్తుంది. ఇవి అసాధారణమైన వివరాలను మరియు డిజైన్ శ్రేష్ఠతను ప్రతిబింబిస్తుంది, మరియు షో సమయంలో పరిమిత కాలం వరకు మాత్రమే లభిస్తుంది అని అన్నారు.

ఈ సందర్భంగా జోయాలుక్కాస్ గ్రూప్ ఛైర్మన్ ఒ ఎండి డా. జోయ్ అలుక్కాస్ మాట్లాడుతూ: "బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో శ్రేష్ఠత పట్ల మా నిబద్ధతను మరియు సొగసు, వ్యక్తిత్వాన్ని ప్రతిధ్వనించే ఆభరణాలను సృష్టించాలనే మా అభిరుచిని చాటుతుంది. తెలంగాణా ఎల్లప్పుడూ మాకు ప్రత్యేకమైనది, మరియు మా వినియోగదారులకు ఈ ప్రత్యేకమైన సేకరణను అందించడం మాకు ఆనందంగా ఉంది, వారికి వజ్రాలను వాటి అత్యంత అద్భుతమైన రూపంలో అనుభవించే అవకాశాన్ని కల్పిస్తున్నాము అని,

ఈ ప్రదర్శన యొక్క ఆకర్షణకు తోడు, షో వ్యవధిలో ?1 లక్ష మరియు అంతకంటే ఎక్కువ విలువైన డైమండ్ జ్యువెలరీ కొనుగోలు చేసిన ప్రతి కస్టమర్‌కు ఉచిత గోల్డ్ కాయిన్ లభిస్తుంది, ఇది వేడుకను మరింత లాభదాయకంగా చేస్తుంది అని, బ్రిలియన్స్ డైమండ్ జ్యువెలరీ షో జూలై 26, 2026 వరకు హైదరాబాద్‌లోని జోయాలుక్కాస్ నిజామాబాద్ షోరూమ్‌లో ప్రత్యేకంగా జరుగుతుంది. నగల ప్రియులు మరియు పోషకులు ఆకర్షణీయమైన వజ్రాల ప్రపంచంలో మునిగిపోవడానికి ఆహ్వానించబడ్డారు అని, ,ఇక్కడ ప్రతి నగ లగ్జరీ, భావోద్వేగం మరియు శాశ్వత సౌందర్యాన్ని ప్రతిబింబిస్తుంది అని వారు తెలిపారు.

# ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి: ఎంపీడీవో ప్రవీణ్ కుమార్



శంకర్‌పల్లి; జూలై 10 (విజన్ ఆంధ్ర): ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్, చందిప్ప గ్రామాలలో ఉన్న బిఎల్ఓ కేంద్రాలను ఆయన సందర్శించి క్షేత్ర సాయి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ గతంలో నమోదైన ఓటరు కార్డులలో ఏవైనా తప్పులు లేదా సమస్యలు ఉంటే, వాటిని సరిచేయడానికి బూత్ లెవెల్ అధికారులు, బూత్ లెవెల్ ఏజెంట్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, బిఎల్వోలు, ఎంపీఓ, ఏపీవో పాల్గొన్నారు.



## ఎడ్యుకేషన్ హబ్ లో 440 పడకల హాస్పిటల్ కి భూమి పూజ

దుద్యాల్, జులై 10(విజన్ ఆంధ్ర ):దుద్యాల మండల పరిధిలోని ఎడ్యుకేషన్ హబ్ లో 440 పడకల హాస్పిటల్ కి కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తిరుపతిరెడ్డి భూమి పూజ చేయడం జరుగుతుంది మన రాష్ట్రంలో ఉస్మానియా గాంధీ హాస్పిటల్ హాస్పిటల్ తరువాత మూడవ అతిపెద్ద హాస్పిటల్ గా లగచర్ల హకింపేట్ పోలేపల్లి ఎడ్యుకేషన్ హబ్ లో ఏర్పాటు కాబోతుంది సీఎం రేవంత్ రెడ్డి ప్రజల సంక్షేమం కొరకు ఎంత అభివృద్ధి అయినా చేస్తారు అని తిరుపతిరెడ్డి తెలియజేశారు ఈ కార్యక్రమంలో కడా ఆఫీసర్ వెంకట్ రెడ్డి మండలంలోని సర్పంచులు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

## ఏన్కూరులో విద్యాసంస్థల బంద్ సంపూర్ణం

ఏన్కూరు, జులై 10(విజన్ ఆంధ్ర): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాలు చేపట్టిన విద్యాసంస్థల బంద్ శుక్రవారం సంపూర్ణంగా జరిగింది. ప్రభుత్వ పాఠశాలల మూసివేతను ఉపసంహరించుకోవాలని, పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్స్ ని తక్షణమే విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు వెంకట్, సుకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలను ఆధునికరించాలని, కనీస మౌలిక సదుపాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని, యుద్ధ ప్రాతిపదన ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, లెక్చరర్ల పోస్టులను భర్తీ చేయాలని, పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్స్ ని విడుదల చేయాలని, కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజులు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నరేష్, గోపి, సాయి, ఉమ, మహేష్, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ నూతన మండల కార్యాలయాన్ని ప్రారంభించిన రేగా కాంతారావు

అశ్వాపురం. జూలై 10. విజన్ ఆంధ్ర : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,అశ్వాపురం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నూతన మండల కార్యాలయాన్ని శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రారంభించారు.

బిఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో రేగా కాంతారావు మాట్లాడుతూ "బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే వెన్నెముక అని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేస్తే రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ మరింత బలోపేతం అవుతుందని ఆయన అన్నారు.



ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యాలయ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

## ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

**- కొడంగల్ నియోజకవర్గ ఎస్ ఎఫ్ ఐ అనిల్ కుమార్**

దౌల్తాబాద్ జూలై 10 (విజన్ ఆంధ్ర) : నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ ఎఫ్ ఐ ) మరియు వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపుతో నిర్వహించిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొండంగల్ నియోజకవర్గ కమిటీ సభ్యులు అనిల్ కుమార్ పాల్గొని మాట్లాడారు.లి తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, గురుకులాలు సరైన మౌలిక వసతులు లేక శిథిల స్థితిలో కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే అన్ని విద్యాసంస్థలకు పక్కా భవనాలు నిర్మించాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ పాఠశాలల సంఖ్యను తగ్గించే ప్రయత్నాలను ప్రభుత్వం విరమించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రెండు జతల యూనిఫార్మ్స్ మరియు పాఠ్యపుస్తకాలు సమకూర్చాల్సిన అవసరం ఉందని, మధ్యాహ్న భోజన పథకానికి సరిపడా నిధులు పెంచి మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న టీచర్, ఎం ఇ ఓ, డి ఇ ఓ మరియు లెక్చరర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, ప్రైవేట్ మరియు కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టేందుకు కఠినమైన ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టాన్ని సమర్థంగా అమలు చేసి పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత ప్రవేశాలు కల్పించాల్సిన అవసరం ఉందని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో అనధికారంగా నిర్వహిస్తున్న పుస్తకాలు, యూనిఫార్మ్స్, నోట్బుక్స్ విక్రయ కేంద్రాలను మూసివేయాలని పేర్కొన్నారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి జి.ఓ నెంబర్లు 7, 8, 9లను రద్దు చేయాలని కోరారు. ఇంటర్మీడియట్ కళాశాలల్లో కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలు, హాస్టల్స్, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, ప్రతి పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్స్ ఏర్పాటు చేసి ఆధునిక సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించి బస్ పాసులు ఇవ్వాలని, మెస్ మరియు కాస్మోటిక్ ఛార్జీలను పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని అన్నారు. అలాగే ప్రతి విద్యాసంస్థలో కరెంట్, త్రాగునీరు, ఇంటర్నెట్, వంటషెడ్లు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని, ఎన్ ఈ పి 2020 ను తెలంగాణలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలని, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ఉన్న రూ.250 కోట్ల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే రానున్న కాలంలో అనేకమైన ఉద్యమ కార్యక్రమాలకు భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ గా పిలుపునిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.నాయకులు శ్రీను ,శ్రీకాంత్ మహేష్ ,తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని ఎస్ఎఫ్ఐ నేతలు స్పష్టం చేశారు.

# ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారంలను త్వరితగతిన బి.ఎల్.ఓలకు అందించాలి

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**- ఎస్ఐఆర్ అమలులో అలసత్వం ప్రదర్శించిన సూపర్వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ**

**- బి.ఎల్.ఏలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ బిఎల్ఓ లకు సహకరించాలి**

నిజామాబాద్, జులై 10 :( విజన్ ఆంధ్ర) ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఓటర్లకు పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ ఫారంలను తగిన వివరాలతో పూరించి త్వరితగతిన బి.ఎల్.ఓలకు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి ఓటర్లకు సూచించారు. వివరాలను డిజిటలైజేషన్ చేయాల్సి ఉన్నందున, నిర్ణీత గడువు వరకు వేచి చూడకుండా వెంటదివెంట ఫారాలను నింపి బి.ఎల్.ఓలకు సమర్పించాలని ఓటర్లను కోరారు. శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ కమిషనర్ పవన్ కుమార్ శర్మ న్యూఢిల్లీ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణలోని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డితో పాటు అన్ని జిల్లా కలెక్టర్లతో ఎస్.ఐ.ఆర్ అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. ఆయా జిల్లాల వారీగా ఎస్.ఐ.ఆర్ అమలులో ఇప్పటివరకు సాధించిన ప్రగతి గురించి అడిగి తెలుసుకుని, ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.

వి.సి అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓలు, సూపర్వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల నుండి ఎన్యూమరేషన్ ఫారంల స్వీకరణ, వాటి వివరాలను డిజిటలైజ్ చేయడంలో వెనుకంజలో ఉన్న సూపర్వైజర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో పురోగతి చూపని నిజామాబాద్ అర్బన్ పరిధిలోని ముగ్గురు సూపర్వైజర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎస్.ఐ.ఆర్ అమలు తీరును తేలికగా తీసుకోరాదని, నిర్ణీత గడువు లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయని వారిపై ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. గడువు సమీపించిన దృష్ట్యా శని, ఆదివారాలు సెలవు దినాలలో కూడా పని చేయాలని తేల్చి చెప్పారు. వచ్చే సోమవారం నాటికి అర్బన్ లో 35 శాతం, రూరల్ నియోజకవర్గాల పరిధిలో 50 శాతం ప్రక్రియ పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓలు కూడా క్షేత్రస్థాయిలో ఉంటూ, ఎన్యూమరేషన్ ఫారంల సేకరణ, వాటి డిజిటలైజేషన్ ప్రక్రియలు వేగవంతం అయ్యేలా పర్యవేక్షణ జరపాలని, రోజువారీ ప్రగతిని తనకు నివేదించాలని ఆదేశించారు. బి.ఎల్.ఓలకు సహకారం అందించేలా వి.ఓ.ఏలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులతో కూడిన వారిని వాలంటీర్లుగా నియమించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఒక్కరు ఓటర్లతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ఎన్యూమరేషన్ ఫారాలు సరైన విధంగా పూరించడంలో వారికి సహకరించాలని హితవు పలికారు.




ప్రతి బి.ఎల్.ఓ వద్ద ఫొటోలతో కూడిన ఓటరు జాబితా తప్పనిసరిగా ఉండాలన్నారు. వివరాల పరిశీలన సమయంలో అందుబాటులో లేని, చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్ళిన, రెండు చోట్ల ఓటు కలిగిన ఓటర్ల పేర్లను గుర్తిస్తూ పక్కాగా జాబితాను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ జాబితాపై రాజకీయ పార్టీలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలని సూచించారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బి.ఎల్.ఏలు స్థానికంగా అందుబాటులో ఉంటూ, ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేందుకు బి.ఎల్.ఓలకు తగిన సహకారం అందించాలని అన్నారు. ప్రతి రోజు ఓటర్ల నుండి 50 చొప్పున ఎన్యూమరేషన్ ఫారంలు సేకరిస్తూ బిఎల్ఓ లకు అందించాలని అన్నారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో బూత్ లెవెల్ ఏజెంట్లు కూడా క్రియాశీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులు తగు చొరవ చూపాలని కలెక్టర్ కోరారు.

కాగా, ఎన్యూమరేషన్ ఫారంలు అందించే విషయంలో ఓటర్లు తాత్సారం చేయకుండా, వెంటనే ఫారాలను వివరాలతో నింపి బి.ఎల్.ఓలకు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాళ్వియ, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయలక్ష్మి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, ఏఈఆర్ఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాలు వెంటనే సమర్పించండి..

## – ఓటు హక్కు కోల్పోవద్దు: మున్సిపల్ కమిషనర్ బి. యాదగిరి



చేవెళ్ల, జులై 10 (విజన్ ఆంధ్ర): చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ప్రతి అర్హ ఓటరు తమ ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాన్ని సంబంధిత బీఎల్‌వోకు తప్పనిసరిగా సమర్పించి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి. యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రజల సౌకర్యార్థం నేడు రెండో శనివారం, అలాగే ఆదివారం కూడా మున్సిపల్ కార్యాలయం పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి అర్హ ఓటరు వినియోగించుకోవాలని సూచించారు. ఎవరూ చివరి వరకు వేచి చూడకుండా తమ ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాలను సంబంధిత బీఎల్‌వోలకు త్వరగా అందజేయాలని కోరారు. ఫారం సమర్పించని పక్షంలో ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఫారాలను సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమానికి ప్రజలంతా సహకరించి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని ఆయన కోరారు.

**దిల్సుఖ్‌నగర్ షిరిడి సాయిబాబా ఆలయ**

# నూతన ధర్మకర్తల ప్రమాణ స్వీకారం

**ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

మర్పల్లి, జులై 10 (విజన్ ఆంధ్ర): దిల్సుఖ్‌నగర్‌లోని షిరిడి సాయిబాబా దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ గుండా మల్లప్ప ఆహ్వానం మేరకు ఆయన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన ఆలయ చైర్మన్ డాక్టర్ లింగయ్యతో పాటు ధర్మకర్తల మండలి సభ్యులకు స్పీకర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సేవలందించే దిశగా ధర్మకర్తల మండలి సమిష్టిగా కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గూడెం రాములు యాదవ్, ఓస్టీ వెంకట్, ఆలయ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**- రూ.50 లక్షలతో మార్కెట్ కమిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే**

**- పీఏసీఎస్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన బీంరెడ్డి.**

**10ఖజూ01: కుల్కచర్లలో మార్కెట్ కమిటీ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే.**



కుల్కచర్ల, జులై, 10 (విజన్ ఆంధ్ర): ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని పరిగి నియోజక వర్గ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. కుల్కచర్ల మండల కేంద్రంలో రూ. 50 లక్షలతో నిర్మించ తలపెట్టిన మార్కెట్ కమిటీ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పీవీఆర్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన నూతన పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి ప్రమాణ స్వీకారోత్సవ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ....పరిగి నియోజక వర్గ అభివృద్ధికి తాము అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని చెప్పారు. పీఎసిఎస్ ల ద్వారా సంఘాలను ఏర్పాటు చేసి బలోపేతం చేయాలన్నారు. పీఏసీఎస్ ల బలోపేతానికి సభ్యులందరూ కృషి చేయాలన్నారు. అంతేకాకుండా ప్రతి గ్రామానికి తారు రోడ్డు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో కుల్కచర్ల సర్పంచి అంజిలయ్య, కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్ నాయక్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు శ్రీధర్ రెడ్డి, బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్ కుమార్, అర్చకులు వీరేశలింగం, నాయకులు కుమ్మరి స్వామి, రవి, ఆనంద్,తదితరులు , పాల్గొన్నారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేదే లేదు..

కుకునూరుపల్లి, జులై 10,విజన్ ఆంధ్ర : విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హైమావతి హెచ్చరించారు. శుక్రవారం ఉదయం కొండపాక మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఉదయం 9:58 నిమిషాలు అటెండర్ తప్ప మెడికల్ ఆఫీసర్ నుండి కిందిస్థాయి సిబ్బంది వరకు గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో సమయ వేళలు పాటించని వైద్యులు, కిందిస్థాయి సిబ్బంది అందరిపైన కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారికి ఫోన్ ద్వారా ఆదేశించారు. గ్రామీణ నిరుపేదలకు ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం చేయడం కోసం ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించిందని, ప్రతి ఒక్కరు ఓపికగా, రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

# వీఆర్ఏ కుటుంబానికి ఆర్థిక సహాయం



నల్లబెల్లి,జులై 10(విజన్ ఆంధ్ర):గ్రామ సహాయకురాలుగా విధులు నిర్వహిస్తున్న మండల కేంద్రానికి చెందిన ఏమునురు కొమరమ్మ అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న స్థానిక తహసిల్దార్ ముప్పు కృష్ణ మృతురాలు ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేశారు అనంతరం దహన సంస్కారాల కోసం కుటుంబ సభ్యులకు రూ. 10 వేల నగదు అందజేశారు అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు ఆయన వెంట మండల గిర్దవర్ మాడ సంపత్, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్,. లక్ష్మీనారాయణ, జిపిఓ ల సంఘం అధ్యక్షులు సదానందం తోపాటు జిపిఓ లు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

# జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి

**-ఆర్టీసీ, రవాణా అధికారులకు టీడబ్ల్యూజేఎఫ్ వినతి**



హైదరాబాద్, జులై 10 (విజన్ ఆంధ్ర ) : జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని కోరుతూ శుక్రవారం జర్నలిస్టులు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ, రవాణా అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టులు ఆర్టీసీ ఉన్నతాధికారులకు, డిపో మేనేజర్లకు విజ్ఞాపన పత్రాలు అందజేశారు. హుస్నాబాద్ లో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు, హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర రవాణా శాఖ అదనపు కార్యదర్శి సునీతాదేవీ లకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ తదితరులు వినతిపత్రాలు సమర్పించారు. అనంతరం వారు ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని బస్ భవన్ లో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ వై.నాగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా సేవలందిస్తున్నారని, తెలంగాణ లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించిన ప్రభుత్వం పరిమిత సంఖ్యలో ఉన్న జర్నలిస్టులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. ప్రభుత్వం, ఆర్టీసీ సంస్థ చాలా ఏళ్ళుగా జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో 1/3 రాయితీ పై ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ పేరుకే 1/3 కానీ జర్నలిస్టుల నుంచి 50 శాతం చార్జీలు వసూలు చేస్తున్నారని అన్నారు. వార్తల సేకరణకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే జర్నలిస్టులకు ప్రయాణ చార్జీలు భారమవుతుందని,దీనిని దృష్టిలో పెట్టుకొని జర్నలిస్టులకు రాష్ట్ర వ్యాప్తంగా(తెలంగాణ ఎర్త్ వైడ్) ఉచిత ప్రయాణం, ఇతర రాష్ట్రాలకు 1/3 రాయితీ సదుపాయం కల్పించాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ రామారావు, పద్మనాభరావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వి. రవికుమార్, నాయకులు ఆర్. శ్రీనివాస్ గౌడ్, ఎం. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెసా గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానం



వాజేడు,జూలై10(విజన్ ఆంధ్ర): ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన అంగన్వాడీ ఆయా, టీచర్ పోస్టుల నోటిఫికేషన్ రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ స్ఫూర్తిని దెబ్బతిసేలా ఉన్నాయని చింతూరు గ్రామపంచాయతీ ఆదివాసీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం చింతూరు గ్రామంలో పెసా గ్రామసభ ఏర్పాటు చేశారు. పెసా చట్టం ప్రకారం మాకు స్వయం నిర్ణయాధికారం, స్వయంపాలనా అధికారం రాజ్యాంగబద్ధంగా లభించిందన్నారు. ప్రభుత్వం జారీ చేసిన అంగన్వాడీ నోటిఫికేషన్, రిజర్వేషన్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాయన్నారు. అంగన్వాడీ ఆయా,టీచర్ పోస్టులు ఆదివాసీలకే కేటాయించాలని 48మంది హాజరు కాగా అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారన్నారు. ఈ విషయమై న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతూరు సర్పంచ్ సుమాంజలి, ఏఎన్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్స నరసింహమూర్తి, పేసా ఉపాధ్యక్షులు పెద్ది జగపతిబాబు, మోబిలైజర్ తుమ్మ రమేష్, మాజీ సర్పంచ్ తెల్లం బుల్లేశ్వరరావు, వాజేడు ఎస్సై జక్కుల సతీష్,కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు

## నివాస సంఘాలతో జీహెచ్ఎంసీ మమేకం

**-అపర్ణా సెరెనిటీలో సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన**

**-'ఒక రోజు-నివాస సంక్షేమ సంఘాలతో మమేకం' కార్యక్రమం నిర్వహణ**

**-ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు.. ప్రత్యేక పారిశుధ్య చర్యలు**

**-డ్రై డేతో దోమల నివారణ.. మొక్కల నాటకం**

**-రోడ్ల గుంతల పూడ్చివేత, ప్యాచ్‌వర్క్ పనులకు శ్రీకారం**

**-వీధి దీపాల ఏర్పాటుపై అధికారుల ప్రత్యేక దృష్టి**

**-ప్రజల సమస్యలను విన్న అధికారులు.. త్వరిత పరిష్కారానికి హామీ**

కుత్బుల్లాపూర్, జూలై 10 (విజన్ ఆంధ్ర): ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడంతో పాటు నివాస సంక్షేమ సంఘాలతో ప్రత్యక్షంగా మమేకమై స్థానిక సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జీడిమెట్ల సర్కిల్--55 పరిధిలోని పెట్‌బషీరాబాద్ అపర్ణా సెరెనిటీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో 'ఒక రోజు--నివాస సంక్షేమ సంఘాలతో మమేకం' కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్, జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, ఐఏఎస్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి శుక్రవారం డ్రై డేలో భాగంగా దోమల నివారణ చర్యలు అమలు చేశారు. హరిత కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడంతో పాటు రోడ్లపై గుంతలను పూడ్చివేసి ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టారు. అవసరమైన ప్రాంతాల్లో వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. కాలనీవాసులు ప్రస్తావించిన పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాలు తదితర సమస్యలను అధికారులు నేరుగా విని, వాటి పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల సర్కిల్--55 డిప్యూటీ కమిషనర్ డి. శంకర్ సింగ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలమురళి, ఏఎంఓహెచ్ డాక్టర్ కవిత, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రాణి, యూబీడీ మేనేజర్ మహేందర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎస్‌డబ్ల్యూఎం) శివప్రకాశ్, పారిశుధ్య సిబ్బంది, అపర్ణా సెరెనిటీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానిక నివాసితులు పాల్గొన్నారు.



# బడంగ్ పేట్‌కు వైద్య వరం

### "విహారిక మెటర్నిటీ & సర్జికల్ క్లినిక్ ఘనారంభం..



**-మహిళలకు, కుటుంబాలకు వరం**

**- OGH, యశోద నిపుణులతో సేవలు**

బడంగ్ పేట్ ప్రతినిధి, జూలై 11 (విజన్ ఆంధ్ర): బడంగ్ పేట్ ప్రజలకు మెరుగైన, సరసమైన వైద్య సేవలు అందించే ఉద్దేశ్యంతో "విహారిక మెటర్నిటీ & సర్జికల్ క్లినిక్" శుక్రవారం అనగా జూలై 10 సాయంత్రం 6 గంటలకు మాస్టర్‌మైండ్స్ స్కూల్ పక్కన ఘనంగా ప్రారంభమైంది.

ప్రారంభోత్సవ వేడుకకు స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులు, పలువురు ప్రముఖులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్లినిక్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రిబ్బన్ కట్ చేసి క్లినిక్‌ను ప్రారంభించారు.

ఒకే చోట అన్ని వైద్య సేవలు

ఈ క్లినిక్‌లో ప్రసూతి, గైనకాలజీ, జనరల్ సర్జరీ విభాగాలకు సంబంధించిన అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. గర్భిణీల సంరక్షణ, అల్ట్రాసౌండ్, సుఖప్రసవం, సిజేరియన్, మహిళల సమస్యలు, ల్యాపరోస్కోపిక్ సర్జరీలు, చిన్న పెద్ద ఆపరేషన్లు, అత్యవసర వైద్య సేవలు ఇక్కడ అందిస్తారు. శుభ్రమైన వాతావరణం, ఆధునిక పరికరాలు, రోగులకు సౌకర్యవంతమైన సదుపాయాలతో క్లినిక్‌ను ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

నిపుణుల బృందంతో ప్రత్యేక చికిత్స

డా. కొండ్ర హారిక – వీదీదూ, మీా (ꠙచీ/ꠈదీ+)

కన్సల్టెంట్ ఆబ్స్టెట్రీషియన్ & గైనకాలజిస్ట్. గర్భిణీల సంరక్షణలో ఏళ్ల అనుభవం ఉంది. ప్రతి గర్భిణీని ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ, మానసిక ధైర్యం ఇస్తూ చికిత్స అందించడంలో ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. "ప్రతి అమ్మ సుఖంగా పురుడు పోసుకోవాలనేదే మా లక్ష్యం" అని ఆమె అన్నారు. డా. బొర్రా విక్రమ్ కుమార్ – వీదీదూ, మీా (GEN. SUR), FIAGES, FCCCM

ఉస్మానియా జనరల్ హాస్పిటల్ జనరల్ సర్జరీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్. యశోద హాస్పిటల్ క్రిటికల్ కేర్ విభాగంలో ఎక్స్–రిజిస్ట్రార్‌గా పనిచేశారు. ల్యాపరోస్కోపిక్ సర్జరీలు, ట్రామా, అత్యవసర శస్త్రచికిత్సలలో ప్రత్యేక నైపుణ్యం ఉంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను కాపాడడంలో ఆయన అనుభవం ఎంతో ఉంది.

ఇద్దరూ కలిసి "అమ్మ, బిడ్డ ఆరోగ్యం – కుటుంబ సంపూర్ణ ఆరోగ్యం'' అనే సేవా సూత్రంతో ఈ క్లినిక్‌ను నడుపుతున్నారు.




క్లినిక్ వివరాలు

చిరునామా: మాస్టర్‌మైండ్స్ స్కూల్ పక్కన, బదంగ్‌పేట్

వేళలు: సోమ – శని: సాయంత్రం 5.00 గం. నుండి రాత్రి 9.00 గం. వరకు

ఆదివారం: అత్యవసర సేవలు మాత్రమే

సంప్రదింపులు: 89858 15515

స్థానికుల హర్షం

ఇప్పటివరకు ఈ ప్రాంత ప్రజలు చిన్న చిన్న ఆరోగ్య సమస్యలకు కూడా ఎల్బీనగర్, ఉస్మానియా లాంటి పెద్ద ఆసుపత్రులకు వెళ్లాల్సి వచ్చేది. ఇకపై ఇంటి దగ్గరే నిపుణులైన వైద్యులతో నాణ్యమైన చికిత్స అందుతుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

"మా లక్ష్యం డబ్బు కాదు, సేవ. ప్రతి రోగిని మా సొంత కుటుంబ సభ్యుడిలా చూసుకుంటాం" అని డా. హారిక, డా. విక్రమ్ కుమార్ దంపతులు తెలిపారు..

## విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటం సాగిస్తాం

**- సామాజిక తెలంగాణ ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు రామచందర్**

నిజామాబాద్ జూలై 10:(విజన్ ఆంధ్ర )విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం పోరాటాలు చేస్తూ వారిని కంటికి రెప్పలా కాపాడుతామని సామాజిక తెలంగాణ ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు రామ్ చందర్ అన్నారు. ఎస్ టీ ఎఫ్

జిల్లా నూతన ఉపాధ్యక్షుడిగా క్రాంతి కిరణ్ రాథోడ్ నియమించిన సందర్భంలో శుక్రవారం ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం విద్యా రంగంలో అనేక సమస్యలు నెలకొన్నాయని, సరైన వసతులు సౌకర్యాలు లేక విద్యార్థులు నాన్న కష్టాలు పడుతున్నారని అన్నారు. సరైన విద్యా బోధన అందక పోటీ పరీక్షలను తట్టుకోలేక వెనుకబడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక తెలంగాణ ఫ్రంట్ ఆధ్వర్యంలో విద్యార్థులను ఏకం చేసి వారితో కలిసి విద్యారంగ సమస్యలపై పోరాటం చేస్తామని, విద్యార్థులకు సరైన విద్యాబోధన తోపాటు అన్ని రకాల వసతులు అందేలా చూస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా నూతన జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన క్రాంతి కిరణ్ రాథోడ్ కు నియామక పత్రం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ టీ ఎఫ్ సురేష్ నాయక్, వికాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాలలో నాటు సారాను నియంత్రించాలి...

వెంకటాపురం జూలై 10( విజన్ ఆంధ్ర) : మండలంలో విచ్చలవిడిగా గ్రామాలలో నాటుసారా విక్రయాలు నియంత్రించాలని, నాటు సారా అమ్మకదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బెల్ట్ షాపులు ఎత్తివేయాలని శుక్రవారం వెంకటాపురం ఎస్సై కొప్పుల తిరుపతిరావుకు అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ( ఐద్వా ) బృందం ఫిర్యాదు చేసింది .ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకురాలు సాధన పెల్లి దేవి మాట్లాడుతూ గ్రామాలలో నాటు సారా, బెల్ట్ షాపుల వలన అనేక కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని, సారాకు బానిసైన వారు మహిళలపై దాడులకు ఆకృత్యాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రధానంగా పేద కుటుంబాలు సారావలన రోడ్డు పాలవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బెల్ట్ షాపులు గుడి బడి అని తేడా లేకుండా ప్రతి సందులో ఒక బెల్ట్ షాపు అవతరించిందని, మహిళలు, విద్యార్థినిలు రోడ్లపై నడవడానికి భయపడే పరిస్థితులు నెలకొని ఉన్నాయని విమర్శించారు. ఐద్వా ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన సార అమ్మకాలు, బెల్ట్ షాపుల వ్యవహారంపై మహిళలను చైతన్యవంతులు చేస్తామని ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ సమన్వయంతో సారా రహిత మండలంగా తీర్చిదిద్దే విధంగా తమ సంఘం కృషి ఉంటుందని పేర్కొన్నారు ఈ బృందంలో మజ్జ సుహాసిని, సినిగిరి సత్యవతి, మడకం పుష్ప, మడకం తిరుపతమ్మ, మడకం దేవి, సమ్మక్క, శ్యామల కేత, రాజేశ్వరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

